1

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నిజామాబాద్-కామారెడ్డి

ఆదివారం | మార్చి 10, 2024 | www.navatelangana.com

అట్టహాసంగా ఎడ్లబండ్ల ప్రదర్శన

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్



వేడుకలకు పెద్దఎత్తున హాజరైన ప్రజలు

నాగిరెడ్డిపేట మండలంలోని తాండూర్ గ్రామంలో గల త్రి లింగ రామేశ్వర ఆలయం వద్ద శనివారం ఎడ్లబండ్ల ప్రదర్శన ఘనంగా నిర్వహించారు. మహాశివరాత్రిని పురస్కరిం చుకుని త్రిలింగ రామేశ్వర ఆలయం ఆవరణలో ఎడ్ల బండ్ల ప్రదర్శన నిర్వహిస్తు న్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు దత్తు తెలిపారు. ఆలయం వద్దకు నాగిరెడ్డిపేట మండల ప్రజలు చేరుకొని ఎడ్లబండ్ల ప్రదర్శనలో పాల్గొన్నారు.

అభివృద్ధి చేతకాక అవాకులు చెవాకులా..?

కామారెడ్డి ఎమ్మెల్యేపై కాంగ్రెస్ ధ్వజం

నవతెలంగాణ-కామారెడ్డి

ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి కామారెడ్డికి పట్టిన శని అని డిసిసి అధ్యక్షులు కైలాస శ్రీనివాసరావు అన్నారు. శనివారం కామారెడ్డి జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో తాను గెలిచిన గెలిచిన 100 రోజుల్లోనే 150 కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని ప్రజలకు మోసపూరిత వాగ్దానాలు చేసి గెలిచిన తర్వాత వాటి గురించి పట్టించుకోకుండా ప్రభుత్వ సలహాదారుపై అవాకులు, చెవాకులు పేలుతున్నారని ధ్వజమెత్తారు. అభివృద్ధి చేయడం చేతకాకపోతే ఇంటికాడ కూర్చో కానీ ఏదో ప్రోటోకాల్ అని దాన్ని అడ్డం పెట్టుకొని అభివృద్ధిని అడ్డుకుంటే మాత్రం వదిలేది లేదని, ప్రజలు తిరగబడి ఇంటిముందుకు వచ్చి కూర్చునే సమయం ఆసన్నమైందని అన్నారు. ఆసుపత్రిలో చేతగాని సవాలు విసిరావు నువ్వు మాట మీద నిలబడే వ్యక్తివి అయితే రాజీనామా చేస్తా అన్నావ్ రాజీనామా చేసి డిపాజిట్ తెచ్చుకో చాలు కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోకపోతే నేను రాజకీయ సన్యాసం తీసుకుంటానని సవాల్ విసిరారు.

నిజాంసాగర్ కెనాల్‌లో ముగ్గురు గల్లంతు

- వేర్వేరు చోట్ల గోదావరిలో నీటమునిగి ఇద్దరు మృతి
- పండుగ పూట కుటుంబాలకు తీరని శోకం



నిజాంసాగర్ కెనాల్ కొట్టుకుపోయిన నారాయణ, విజయ్, విష్ణు

నవతెలంగాణ-నిజామాబాద్/నందిపేట్/వర్ని(చందూర్)

ముప్కాల్‌లో ఎస్సారెస్పీ కాలువలో ముగ్గురు విద్యార్థులు నీటమునిగి మృతిచెందిన వార్త మరవకముందే.. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా శనివారం విషాదకర ఘటనలు చోటుచేసుకున్నాయి. వర్ని మండలంలో నిజాంసాగర్ కాలువలో ముగ్గురు కొట్టుకుపోయి గల్లంతు కాగా, వేర్వేరు ప్రమాదాల్లో గోదావరిలో నీటమునిగి ఇద్దరు మృతిచెందారు. పండుగ పూట వేళ.. బాధిత కుటుంబాల్లో తీరని శోకం మిగిలింది.

వర్ని : నిజాంసాగర్ ప్రధాన కాలువలో పడి ముగ్గురు గల్లంతయ్యారు. ఈ విషాద ఘటన వర్ని, చందూర్ మండలాల్లో శనివారం చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. వర్ని మండలంలోని అపందిఫారం తాండ గ్రామానికి చెందిన నారాయణ(22) అనే యువకుడు గ్రామ సమీపంలోని నిజాంసాగర్ ప్రధాన కాలువలోకి ఈత కోసం వెళ్లగా.. నీటి వేగానికి కొట్టుకుపోవడంతో అక్కడే పంట కోసం పైపుల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు వచ్చిన విజయ్ (50) అనే రైతు నారాయణ కొట్టుకుపోవడాన్ని గమనించి కాపాడటానికి వెళ్లాడు. దీంతో విజయ్ సైతం కాలువలో గల్లంతయ్యాడు. ఇద్దరు కొట్టుకు పోవడాన్ని గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. కాగా విజయ్‌కు భార్య కొడుకు, కూతురు ఉన్నారు.

అలాగే చందూర్ మండల కేంద్రానికి చెందిన విష్ణు (21) తన ఇద్దరు మిత్రులతో కలిసి గ్రామ సమీపంలోని నిజాంసాగర్ కాలువ వద్దకు స్నానానికి వెళ్లాడు. అయితే విష్ణు స్నానానికి కాలువలోకి దిగడంతో నీటి వేగానికి కొట్టుకుపోయాడు. ఇది గమనించిన మరో ఇద్దరు స్నేహితులు భయంతో గ్రామానికి చేరుకొని గ్రామస్తులకు సమాచారమిచ్చారు. విషయం తెలుసుకున్న పోలీసులు చందూర్ నిజాంసాగర్ కాలువ వద్దకు చేరుకుని గాలింపు చేపట్టారు. కాగా విష్ణుకు తల్లి పద్మ ఉంది. ఒకే రోజు ముగ్గురు గల్లంతవడంతో మూడు కుటుంబాల్లో విషాదం నెలకొంది. ఈ రెండు ఘటనలు సుమారు మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో చోటుచేసుకోగా.. రాత్రి అయినా ముగ్గురి ఆచూకీ లభించలేదు. గాలింపు చర్యలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి.



నిజామాబాద్ : గోదావరి పుష్కరఘాట్ వద్ద గల్లంతై ఒకరు మృతిచెందారు. ఈ ఘటన మెండోరా మండలంలో శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మాక్లూర్ మండలం అడి మామిడిపల్లికి చెందిన మహేష్ (28) శివరాత్రి పర్వదినం సందర్భంగా దేవాలయాన్ని దర్శించుకోవడానికి తన కుటుంబంతో కలిసి పోచంపాడ్ శివాలయానికి వచ్చారు. మహేష్, అతని బావ దండ్ల శ్రీను, నాన్న మక్కల రెడ్డి, దండ్ల బాలయ్య గోదావరి నది పుష్కర ఘాట్ వద్ద స్నానానికి వెళ్లగా.. మక్కల మహేష్ ప్రమాదవశాత్తు నీట మునిగి చనిపోయాడు. మృతదేహాన్ని పోలీసులు వెలికి తీసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గోదావరి బ్యాక్‌వాటర్‌లో పడి



నందిపేట్ : మండలంలోని ఉమ్మేడ ఉమామహేశ్వర ఆలయం వెనుక గోదావరి నదిలో ప్రమాదవశాత్తు జారిపడి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన శనివారం చెటుచేసుకుంది. ఎస్సై రాహుల్ తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరు జిల్లా కలిగిరి మండలం నుంచి బతుకు దెరువు కోసం డొంకేశ్వర్ మండలానికి కొండ బోయిన మాధవ్(38) వలస వచ్చారు. వట్నోలి గ్రామంలో మేస్త్రి పని చేస్తుంటాడు. అతని స్నేహితుడు కర్ర రమేష్‌తో కలిసి శివరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు గోదావరి వెనుక జలాల్లో పడి మృతిచెందాడు. గజ ఈతగాళ్ళు వెలికి మృతదేహాన్నీ బయటకు తీశారు. స్నేహితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు.

హాస్టళ్లల్లో విద్యార్థులు భద్రమేనా?

- స్థానికంగా ఉండని వార్డెన్‌లు
- ఇన్‌చార్జి ఇస్తే.. ఇంటి నుంచే బాధ్యతలు
- పైస్థాయి తరగతుల విద్యార్థులే పర్యవేక్షకులు
- అనధికార వ్యక్తులకు బాధ్యతలు
- పర్యవేక్షించని ఉన్నతాధికారులు
- బోధన్‌లో విద్యార్థి మృతితో హాస్టల్ విద్యార్థుల తల్లిదండ్రులలో ఆందోళన

నవతెలంగాణ-గాంధారి



గాంధారిలోని వసతిగృహం

ప్రభుత్వ హాస్టళ్లల్లో విద్యార్థులు భద్రమేనా అనే సందేహం వారి తల్లిదండ్రుల్లో కలుగుతోంది. ఇటీవల బోధన్ హాస్టల్‌లో నెలకొన్న గొడవలో గాంధారి మండలానికి చెందిన డిగ్రీ విద్యార్థి మృత్యువాత పడటంతో హాస్టళ్ల నిర్వహణపై వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హాస్టల్ వార్డెన్‌లు స్థానికంగా ఉండకపోవడంతో తమ బాధ్యతలను పైస్థాయి తరగుతల వారికి అప్పగిస్తుండటంతో పాటు ప్రయివేటు వారిని తీసుకొస్తుండటంతో నిర్వహణ నామమాత్రం అవుతుంది. విద్యార్థుల మధ్య ఏదైనా గొడవలు చోటుచేసుకుంటే వాటిని అప్పటికప్పుడు సద్దుమణిగించే వారు లేక కొట్లాటలకు దారి తీస్తుండటం గమనార్హం.

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఏకలవ్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ కస్తూర్బాహాస్టల్లో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ గురుకుల పాఠశాలలు సుమారు 130 వరకు ఉన్నాయి. అయితే పలువరు వార్డెన్స్, ప్రిన్సిపల్స్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తు న్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల బోధన్ బీసీ హాస్టల్ లో విద్యార్థులు ఘర్షణ పడి డిగ్రీ విద్యార్థి మృతి చెందడంతో జిల్లాలోని వివిధ హాస్టల్లో ఉండి చదువుకుంటున్న విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యమిస్తూ హాస్టల్ ను ఏర్పాటు చేస్తూ మధ్యతరగతి ప్రజల పిల్లలు కూడా మంచి చదువులు చదువుకొని ఉన్నత స్థాయిలో ఉండాలని లక్ష్యంతో ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుంటే.. తమ ఉద్యోగ బాధ్యతలను కొందరు ప్రిన్సిపల్స్, కొంతమంది వార్డెన్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని విద్యార్థి సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. ప్రభుత్వంపై నమ్మకంతో ప్రభుత్వం ఏర్పరుస్తున్న సౌకర్యాలతో పిల్లలకు మంచి భవిష్యత్తు ఉంటుందని నమ్మి తల్లిదండ్రులు హాస్టల్లో చేర్పిస్తుంటే అధికారుల నిర్లక్ష్యంతో ఎంతో భవిష్యత్తు ఉన్న విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్నారని విద్యార్థులు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత మూడు సంవత్సరాల క్రితం ఏకలవ్య గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంతో విద్యార్థి పాము కాటు గురై మృతి చెందాడు. అలాగే ఇటీవల బోధన్ పట్టణంలో వార్డెన్ నిర్లక్ష్యంతో గాంధారి మండలం చెందిన విద్యార్థి ప్రాణాలు కోల్పోయాడు. తల్లిదండ్రులకు ఎంతో నమ్మకంతో హాస్టల్లో పంపిస్తుంటే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరస్తు న్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

ప్రభుత్వం వసతిగృహాలకు పెద్ద మొత్తంలో నిధులు కేటాయిస్తున్నా క్షేత్రస్థాయిలో లో అనుకున్నంత వరకు స్థాయిలో సదుపాయాలు సమకూర లేదు. స్థానికంగా ఉండాల్సిన వార్డెను, ప్రిన్స్ పాళ్లు దూరప్రాంతం నుంచి వారానికి రెండు, మూడుసార్లు వస్తూ వెళుతున్నారని వివిధ విద్యార్థి సంఘాలు నాయకులు ఆరోపిస్తున్నారు. హాస్టల్లో మరుగుదొడ్లు సక్రమంగా లేకపోవడంతో బయటకి వెళ్తున్నారు. జిల్లాలోని కొన్ని మండలాల్లో హాస్టల్లో నీటి కొరత ఉండడంతో విద్యార్థులు స్థానాల కోసం వాగులకు, చెరువులకు స్నానం చేయడానికి వెళుతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే దానికి బాధ్యులు ఎవరని విద్యార్థి సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా హాస్టళ్లలో నీటి కొరత ఉండడం వలన విద్యార్థులు స్నానాలకు ఇబ్బందులు పడుతున్నారు.

అలాగే గాంధారి మండల కేంద్రంలోని ఏకలవ్య గురుకుల పాఠశాల విద్యార్థులు రాత్రి సమయంలో గాంధారి మండల కేంద్రంలో రాత్రి 11:30 సమయంలో కూడా అనేకమంది సంచరిస్తున్నారు. అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా చర్యలు తీసుకోవడం లేదని విద్యార్థి సంఘం నాయకులు ఆరోపిస్తున్నారు. ప్రజా ప్రతినిధులు జిల్లా స్థాయి అధికారులు తక్షణమే స్పందించి హాస్టళ్లను పర్యవేక్షించాలని విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

వార్డెన్ పోస్టులు భర్తీ చేయాలి

ఎస్ అజయ్ కుమార్
ఎస్ఎఫ్ఐ కామారెడ్డి జిల్లా కార్యదర్శి



బోధన్ బీసీ కళాశాల హాస్టల్‌లో ఓ విద్యార్థి మృతి చెందడంతో ప్రభుత్వం నిర్లక్ష్యం ఖచ్చితంగా ఉంది. హాస్టల్ వార్డెన్ లకు ఒక్క హాస్టల్ కి మాత్రమే పరిమితం కావాలి. కానీ ఈ ప్రభుత్వం ఒక్క హాస్టల్ వార్డెన్‌కు రెండు నుండి మూడు హాస్టల్‌లకు ఇన్‌చార్జి ఇవ్వడం ఏ ఒక్క దగ్గర సరిగా పనిచేయలేకపోతున్నారు. బోధన్ హాస్టల్‌లో ఆ సమయంలో వార్డెన్ లెనందున విద్యార్థుల్లాలో ఘర్షణ ఏర్పడి కొట్లాడుకోవడంతో ఓ విద్యార్థి మృతి చెందాడు. తక్షణమే హాస్టల్ వార్డెన్ పోస్టలను భర్తీ చేయాలి. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న వార్డెన్‌లపై చర్యలు తీసుకోవాలి.

నేడు బీఆర్ఎస్ నియోజకవర్గ సమావేశం

- ఎట్టకేలకు స్పందించిన అధిష్టానం

నవతెలంగాణ-కామారెడ్డి



బీఆర్ఎస్ పార్టీ కామారెడ్డి నియోజకవర్గ స్థాయి సమావేశం నేడు (ఆదివారం) పట్టణంలోని సత్య గార్డెన్‌లో ఏర్పాటు చేసినట్టు నాయకులు తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభం కానున్నట్లు తెలిపారు. ఇక్కడి నుంచి పోటీ చేసి కేసీఆర్ ఓడిపోయినప్పటి నుంచి మీటింగ్ జరగలేదని, పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందంటు ఆ పార్టీలో కొనసాగుతున్న అంతర్గత చర్చపై నవతెలంగాణలో ఈ నెల 7వ తేదీనా కథనం ప్రచురించిన విషయం విధితమే.

ఈ నేపథ్యంలో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించనున్నట్టు జిల్లా కేంద్రానికి చెందిన తెలంగాణ ఉద్యమ తొలి కార్యకర్త రమేష్ గుప్తా తెలిపారు. నేటి (ఆదివారం) సమావేశానికి బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే మంత్రి వేములప్రశాంత్‌రెడ్డి, మాజి విప్ గంపగోవర్ధన్, జిల్లా అధ్యక్షుడు ముజుబుద్దిన్, నిట్టు వేణుగోపాల్ తదితరులు హాజరుకానున్నట్టు తెలిపారు. 11 గంటలకు జిల్లా కేంద్రంలోని సత్య గార్డెన్‌లో కామారెడ్డి నియోజకవర్గస్థాయి సమావేశానికి హాజరుకా నున్నారు. కాబట్టి కామరెడ్డి పట్టణానికి చెందిన ముఖ్య నాయకులు, సీనియర్ నాయకులు, కౌన్సిలర్లు మహిళా కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, అనుబంధ సంబంధ అధ్యక్షులు, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు హాజరై సభను దిగ్విజయం చేయగలరని బీఆర్ ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జూ కంటి ప్రభాకర్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మద్దికుంటలో ముగిసిన ఉత్సవాలు

- పలు ఆలయాల్లో అన్నదానం



అగ్నిగుండములో నడుచుకుంటూ వెళ్తున్న పలువురు

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని మద్దికుంటలో వెలసిన శ్రీ స్వయంభు బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో మూడవరోజు శనివారం అగ్ని గుండములు, రుద్రాభిషేకాన్ని జంగం ప్రభాకర్ స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయంలో మూడు రోజులు శివరాత్రి ఉత్సవాలు కన్నుల పండగ ప్రశాంతంగా నిర్వహించారు. మండలంలోని పోసానిపేట శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో, అన్నారం శ్రీ ఉమామహేశ్వర స్వామి ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. శుక్రవారం రాత్రి మద్దికుంట ఆలయ పరిసరాల్లో సందర్శకుల జాగారణ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గోజారి లచ్చిరెడ్డి, ప్రధాన పూజారి ప్రభాకర్ స్వామి, గణేష్ స్వామి, అవినాష్ స్వామి, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

సీఐ కార్యాలయానికి ముగ్గురు రౌడీషీటర్ల బైండోవర్

నవతెలంగాణ-రెంజల్

మండలానికి చెందిన ముగ్గురు రౌడీషీటర్లను బోధన్ రూరల్ సీఐ కార్యాలయానికి తరలించినట్లు ఇన్చార్జి ఎస్సై రవీందర్ తెలిపారు. పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న ఈ తరుణంలో రౌడీషీటర్లను ముందస్తుగా అదుపులోకి తీసుకొని వ్యక్తిగత పూచీకత్తుపై వదిలివేయనున్నట్లు వారు పేర్కొన్నారు.

సేవగా భావించి వైద్యం అందించాలి

- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ
- ఆస్పత్రిలో అదనపు గదులు ప్రారంభోత్సవం

నవతెలంగాణ-కామారెడ్డి

పేద ప్రజలకు సేవ చేస్తే దేవుడికి సేవ చేసినట్లుగా వైద్యులు భావించాలని ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. కామారెడ్డి ప్రభుత్వాసుపత్రిలో శనివారం వంద పడకల అదనపు గదులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానవసేవే మాధవసేవాగా వైద్యులు భావించాలని సూచిం చారు. వైద్యులు అంకిత భావంతో పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని తెలిపారు. రూ.4.53 కోట్లతో ప్రభుత్వాసుపత్రిలో వంద పడకల కోసం అదనపు గదుల నిర్మాణం పూర్తయిందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచాలని వైద్యులకు సూచించారు. ప్రభుత్వాసు పత్రిలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని వైద్యులకు సూచించారు. తాను ప్రభుత్వం దృష్టికి తీసుక్లె సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్ట్ 21,22 ప్యాకేజీ పనులను పూర్తి చేయడానికి రూ.28 కోట్ల నిధులు మంజూరు చేయాలని తాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరానన్నారు. రెండు



అదనపు గదులు ప్రారంభిస్తున్న షబ్బీర్‌అలీ

ప్యాకేజీలు పూర్తయితే ఎల్లారెడ్డి, కామారెడ్డి నియోజకవర్గంలోని ఆయకట్టు ప్రాంతాలకు సాగునీరు అందుతుందని, తద్వారా ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతోందని పేర్కొన్నారు.

అనంతరం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో 100 పడకలు అదనంగా ప్రారంభించడంతో జిల్లా ప్రజలకు మరింత ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. వైద్యులు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని కోరారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెంట్ డాక్టర్ రామ్ సింగ్, డిసిహెచ్ఎస్ విజయలక్ష్మి, మున్సిపల్ వైస్ చైర్పర్సన్ ఇందూ ప్రియ, కౌన్సిలర్ స్వప్న, జడ్పిటిసి సభ్యులు నా రెడ్డి మోహన్ రెడ్డి, తిరుమల్ గౌడ్, వైద్యులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏ ప్రోటోకాల్ ప్రకారం షబ్బీర్‌అలీని ఆహ్వానించారు?

కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ప్రశ్న



జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో అదనపు గదుల ప్రారంభోత్సవానికి ఏ ప్రోటోకాల్ ప్రకారం ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీని అహ్వానించారని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ప్రశ్నిం చారు. ఏ జీవో ప్రకారం శిలాఫలకంపై ఆయన పేరు చేర్చారో చెప్పాలని కలెక్టర్‌ను డిమాండ్ చేశారు. ఆస్పత్రిని సందర్శించిన అనంతరం శనివారం విలేకరుల సమా వేశంలో మాట్లాడారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ప్రారంభోత్సవానికి జిల్లాలోని మిగితా ముగ్గురు ఎమ్మెల్యేలను ఎందుకు ఆహ్వానించలేదని ప్రశ్నించారు. కొంత మంది ప్రభుత్వ అధికారులు అధికార పార్టీ నాయకులకు డబ్బులు ఇచ్చి కామారెడ్డిలో పోస్టింగ్ వేయించుకున్నారని ఆరోపించారు. ఇక్కడ అవినీతి జరగనివ్వనని మరోమారు స్పష్టంచేశారు.

మహిళలకు చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలి

- శ్రమను గుర్తించి మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలి
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాట్లాడుతున్న నూర్జహాన్

మహిళలకు చట్ట సభల్లో 33శాతం రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలని, శ్రమను గుర్తించి మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించా లని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. శనివారం సీఐటీయూ కార్యాల యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం స్వర్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నూర్జహాన్ మాట్లాడుతూ.. కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నదన్నారు. కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం మతోన్మాద విధానాలను వేగవంతం చేసిందని తెలిపారు. శ్రమను, శ్రమ చేసే మహిళలను గౌరవించడం లేదని విమర్శించారు. మహిళా హక్కులు మానవ హక్కుల్లో భాగమే, కానీ బిజెపి ప్రభుత్వం మహిళల హక్కులను హరిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. పోరాడి సాధించుకున్న శ్రామిక మహిళల చట్టాలను రద్దు చేసి పారిశ్రామికవేత్తల లాభాల కోసం 4 లేబర్ కోడ్‌లను తెచ్చిందని, దేశవ్యాప్తంగా మహిళలు, పిల్లలపై అత్యాచారాలు, హింసలు బాగా పెరిగాయని తెలిపారు. మహిళలకు సమాన హక్కులు, శ్రమకు గుర్తింపు, సమాన పనికి సమాన వేతనాలు, మహిళలపై అత్యాచారాలు, హింసను అరికట్టడం, నేరస్థులకు కఠిన శిక్షలు, చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ల అమలు, మహిళలు పెద్ద సంఖ్యలో నిరుద్యోగంతో బాధపడటం లాంటి ప్రధాన సమస్యలను పరిష్కరించడంలో బిజెపి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని చెప్పారు. మహిళలు చేస్తున్న జీతభత్యం లేని శ్రమ విలువ దేశ స్థూల జాతీయోత్పత్తిలో 3.1 శాతం ఉందని, జాతీయ స్థూల ఉత్పత్తిలో ప్రధాన పాత్ర పోషిస్తున్న మహిళల కనీస అవసరాలను కూడా ప్రభుత్వాలు తీర్చడం లేదని నొక్కిచెప్పారు. ఇన్ని బాధ్యతలు మోయవలసి రావటంతో వారి సమయం, శక్తి మొత్తం ఈ వేతనం లేని శ్రమకే వెచ్చిస్తున్నారని వివరించారు. ఇటువంటి వేతనం లేని సంరక్షణ పనులు కోసం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు రోజులో 5 గంటలకుపైగా వెచ్చిస్తు న్నారని, వీటన్నిటితో పాటు పని ప్రదేశాలలో శ్రామిక మహిళలు వేతనాలు, సర్వీసు కండీషన్లు, గౌరవం, పదోన్నతుల విషయంలో తీవ్ర వివక్షకు, అవమానా లకు గురౌతున్నారని తెలిపారు. దేశంలో మహిళలు అభద్రతతో బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారని పేర్కొన్నారు. మతోన్మాద మనువాదులు మహిళలపై హత్యలు, అత్యాచారాలతో చెలరేగిపోతున్నారని, మహిళలు సంఘటితమై ప్రతిఘటించడం తప్ప దీనికి మరొక పరిష్కారం లేదని తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ స్ఫూర్తితో మహిళలను చైతన్యపరుద్దాం- పోరాటాలను ఉధృతం చేద్దామని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మహిళా వ్యతిరేక విధానాలను ఐక్యంగా ప్రతిఘటిద్దామన్నారు. సమానత్వం, శ్రమకు తగిన గుర్తింపును సాధించుకుందామని సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లను, ఆయాలను, ఆశాలను, జీఎన్ఎంలను సన్మానించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకర్ గౌడ్, సిఐటియు జిల్లా కోశాధికారి సూర్య కళ, రేణుక, సుకన్య లలిత, హైమావతి సాహేరా, రేవతి, వాణి, సందీప, సరిత, రాజ్యలక్ష్మి, సల్మా పాల్గొన్నారు.

నూతన విద్యావిధానంలో శాస్త్రీయ ఆలోచన లేదు

- అమలు చేసే నిర్ణయాన్ని కేంద్రం ఉపసంహరించుకోవాలి
- ప్రొఫెసర్ ఆమంచి నాగేశ్వర్ రావు
- యూనివర్సిటీల్లో ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయాలని సూచన
- టీయూలో అట్టహాసంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర యూనివర్సిటీల కన్వెన్షన్ ప్రారంభం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ నాగేశ్వర్‌రావు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

కేంద్రం నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకువచ్చి విద్య రంగాన్ని ధ్వంసం చేస్తుందని, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ స్వయం ప్రతిపత్తినీ దెబ్బతీసేలా మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆమంచి నాగేశ్వర్ రావు అన్నారు. శాస్త్రీయ ఆలోచన లేని నూతన జాతీయ విద్యా విధానాన్ని కేంద్రం అమలు చేయొద్దని డిమాండ్ చేశారు. తెలంగాణ యూనివర్సిటీలో శనివారం భారత విద్యార్థి ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) యూనివర్సిటీల కన్వెన్షన్ మొదటి రోజు కామ్రేడ్ భారతి నగర్‌లో అట్టహాసంగా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ పతాకాన్ని రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి ఆవిష్కరించారు. ఇటీవల మరణించిన ప్రముఖులకు సంతాప తీర్మానాన్ని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాచకొండ విగ్నేష్ ప్రవేశపెట్టారు.

ఈ కార్యక్రమానికి అతిథిగా ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ఆమంచి నాగేశ్వర్‌రావు హాజరై ప్రసంగించారు. యూనివర్సిటీ నాయకులు దినేష్, చిత్రు, పవన్ తదితర నాయకులు పాల్గొన్నారు.

వివరాలు మెయిన్‌లో..

ట్యాక్స్‌పై పెనాల్టీకి రాయితీ

- 90 శాతం కల్పిస్తూ మున్సిపల్ ప్రత్యేక ఆఫర్
- ప్రధాన కూడళ్ల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



మున్సిపల్ ట్యాక్స్ చెల్లించకుండా పెండింగ్ ఉండటంతో వాటిపై విధించిన పెనాల్టీపై 90 శాతం రాయితీ కల్పిస్తూ మున్సిపల్ శాఖ ప్రత్యేక ఆఫర్ ప్రకటించింది. ఆర్థిక సంవంత్సరం ముగుస్తున్న నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న ట్యాక్స్ రాబట్టుకునేందుకు కసరత్తు చేస్తుంది. దీంట్లో భాగంగా పెనాల్టీపై ఏకంగా 90 శాతం రాయితీ కల్పించింది. మార్చి 31వ తేదీ వరకు ఈ ఆఫర్ ప్రకటించింది. దీంతో పాటు కొత్త ఆర్థిక సంవత్సరంలో వచ్చే ట్యాక్స్‌ను ఏప్రిల్ చివరి తేదీ వరకు చెల్లించిన వారికి 5 శాతం డిస్కౌంట్ ప్రకటించింది. దీనికి సంబంధించిన నగరంలోని ప్రధాన కూడళ్ల వద్ద మున్సిపల్ ఆధ్వర్యంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

అంతే కాకుండా 2023-24 సంవత్సరానికి చెందిన ఇంటి, వ్యాపార సముదాయాల ఆస్తి పన్ను మార్చి 31 వరకు చెల్లింపు చేసిన వారికి 2024-25 సంవత్సరంలో ఏప్రిల్ 30 వరకు 5 శాతం రిబేట్ ఇవ్వనున్నట్టు సమాచారం. ఆస్తి పన్నును చెల్లించేందుకు ఆన్‌లైన్‌లో సైతం అవకాశం ఉంది. emunicipal.telangana.gov.in వెబ్‌సైట్‌లో 10 అంకెల PTIN ఎంటర్ చేసి చెల్లించే అవకాశం కల్పించింది.

శివాలయంలో అన్నదానం

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని సాటాపూర్ శివాలయంలో భక్తులకు ఉపవాస దీక్షను విడిచేందుకు రామాలయ కమిటీ చైర్మన్ నితిన్ అన్నదాన కార్యక్రమాన్ని స్థానికుల సహాయ సహకారాలతో చేపట్టారు. శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కడక్ సాయిలు, అంకం గంగాధర్, శ్రీకాంత్, రఘునాథ్, రాకేష్, మీసాల నారాయణ స్థానిక యువత, తదితరులు ఉన్నారు.


అన్నదానం చేస్తున్న నాయకులు

మర్రిచెట్టు దేవస్థానానికి కిలో వెండి కిరీటం బహూకరణ

నవతెలంగాణ-ముప్కాల్

నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన చక్రధర్ దంపతులు శనివారం ముప్కాల్ మర్రిచేట్టు దేవస్థానం 'శ్రీ శివ లింగేశ్వర స్వామి' ఆలయానికి కేజీ సిల్వర్ (వెండి)కిరీటాన్ని విరాళంగా శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆ దంపతులను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు కనుగుంట లింగం, సెక్రటరీ గంగారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ముస్కు భూమేశ్వర్ రెడ్డి, బ్రమ్మదండి లింగం, శ్రీనివాస్ గౌడ్, కంచు విజయ్, అశోక్ రెడ్డి, ఆలయ అర్చకులు సోమానాథ్ చార్యులు తదితరులు పాల్గొన్నారు.


వెండి కిరీటం అందజేత

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ


సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ మండలంలోని రెంజర్ల గ్రామంలో శనివారం ఉదయం సీసీ రోడ్ల పనులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మగ్గిడి ముత్యం రెడ్డి మాట్లాడుతూ.. ఎన్ఆర్ఈజీస్ నిధులతో గ్రామంలోని ఇందిరమ్మ కాలనీలో సీసీ రోడ్ల పనులను ప్రారంభించినట్టు తెలిపారు. మొత్తం రూ.10లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించినట్టు ఆయన తెలిపారు. రానున్న రోజుల్లో మిగితా నిధులతో పనుల్ని పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు పాలెం చిన్నారెడ్డి, ఓటీసీ మండల అధ్యక్షులు ఆకుల రమేష్, నవీన్, ప్రశాంత్, చిన్న రాజన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

13 పెన్షనర్ల కుటుంబ సమ్మేళనం

- తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్



మాట్లాడుతున్న కె.రామ్మోహన్‌రావు, మదన్‌మోహన్‌రావు

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ నిజామాబాద్ జిల్లా ఆధ్వర్యంలో మార్చి 13 (బుధవారం) అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పెన్షనర్ల కుటుంబ సమ్మేళనాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా అధ్యక్షులు కే రామ్మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి ఎస్.మదన్‌మోహన్ తెలిపారు. శనివారం నిజామాబాద్ నగరంలోని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నిజామాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 13న వినాయక్‌నగర్‌లోని బస్వా గార్డెన్ వద్ద ఈ కార్యక్రమం ఉదయం 10:30 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అడిషనల్ కలెక్టర్ కిరణ్ కుమార్, జిల్లా ప్రజా పరిషత్ సీఈవో ఉషా తదితరులు హాజరవుతున్నారని వారు తెలిపారు. సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షులు శాస్త్రుల దత్తాత్రేయరావు, ఉపాధ్యక్షులు భోజారావు, కోశాధికారి నారాయణ, అసోసియేట్ ప్రెసిడెంట్ సుదర్శన్‌రాజు, నిజామాబాద్ డివిజన్ అధ్యక్షులు హనుమాన్లు, కార్యదర్శి ప్రసాద్‌రావు, జిల్లా నాయకులు దీన సుజనా, పూర్ణచంద్రరావు, జ్ఞానేశ్వర్, శంకర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల బకాయి వేతనాలను చెల్లించాలి

- సిఐటియు జిల్లా నాయకులు జంగం గంగాధర్


మాట్లాడుతున్న సిఐటీయు జిల్లా నాయకులు జంగం గంగాధర్

నవతెలంగాణ-ఎడపల్లి

నిజామాబాద్ జిల్లా లోని పలు గ్రామాల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు గత మూడు నెలల నుంచి వేతనాలు ఇవ్వడం లేదని, వెంటనే చెల్లించాలని సిఐటీయు జిల్లా నాయకులు జంగం గంగాధర్ డిమాండ్ చేశారు. శనివారం ఎడపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 11వ తేదీన మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో బకాయి వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేపట్టనున్నట్టు వివరించారు. అలాగే రోజురోజుకు పెరుగుతున్న నిత్యవసరాల ధరలను గమనంలోకి తీసుకొని, పారిశుధ్య కార్మికులకు సిబ్బందికి వేతనాలను వెంటనే మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జీపి పారిశుధ్య కార్మికులకు రావాల్సిన బకాయి వేతనాలను సకాలంలో చెల్లించకుంటే ఈనెల 21న సీఐటీయూ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపడతామని హెచ్చరించారు.

ముగిసిన శివరాత్రి ఉత్సవాలు

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ మండల కేంద్రంతో పాటు మండలంలోని కొత్తపల్లి, వేంపల్లి గ్రామాలలో మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా చివరి రోజైన శనివారం ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేసినందుకు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు ఈ సందర్భంగా భక్తులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పలు ఆలయాల్లో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువజన సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాతంత్ర విప్లవ యోధుడు కామ్రేడ్ రాయల సుభాష్ చంద్రబోస్

- నివాళులర్పించిన నాయకులు

నవతెలంగాణ-విలేకరుల బృందం
నిజామాబాద్ సిటీ :

భారత విప్లవ పోరాట యోధుడు కామ్రేడ్ రాయల సుభాష్ చంద్రబోస్ అని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ తెలిపారు. సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) నిజామాబాద్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఎన్.ఆర్ భవన్ కోటగల్లీలో 8వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాతంత్ర విప్లవ స్వాప్నికుడు కామ్రేడ్ రాయల సుభాష్ చంద్రబోస్ అని అన్నారు. పీడిత ప్రజల విముక్తి కోసం, ప్రజాపంథా నిర్మాణం కోసం 43 సంవత్సరాల సుదీర్ఘ జీవితాన్ని అజ్ఞాతంలో గడిపారన్నారు. కామ్రేడ్ రవన్న జీవితం కమ్యూనిస్టులకు స్ఫూర్తిదాయకమన్నారు. దేశంలో ఒక పక్క నిరుద్యోగం, పేదరికం, అసమానతలతోపాటు, సకల రంగాలలో సంక్షోభాలు ఎదురవుతున్నాయన్నారు. మరోపక్క మత ఉన్మాదం, మత విద్వేషం కట్టలు తెంచుకుని ప్రజల మీద స్వైర విహారం చేస్తున్నదన్నారు. ప్రగతి నిరోధక, సంకుచిత భావజాలం మనుషులను ఉన్మాదులుగా మార్చుతున్నదన్నారు. తిండి మీద, కట్టుబాట్ల మీద, స్వేచ్ఛా హక్కుల మీద, భావ ప్రకటనల మీద ఆంక్షలు, నిషేధాజ్ఞలను విధిస్తున్నదని తెలిపారు. మొత్తంగా స్వాతంత్రోద్యమం రూపొందించుకున్న రాజ్యాంగాన్నే ధ్వంసంచేసి, మనువాద రాజ్యాంగ నిర్మాణానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. విద్య, సంస్కృతి, చరిత్ర, వివిధ పౌర ప్రజాస్వామిక సంస్థలనూ, వ్యవస్థలనూ మొత్తం కాషాయీకరించి జర్మనీ తరహా నాజీయిజాన్ని దేశంలో తీసుకువచ్చే యత్నాలు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ప్రధాన మీడియా, సోషల్ మీడియాల నుంచి న్యాయ వ్యవస్థ దాకా అన్ని వ్యవస్థలను మోడీ ప్రభుత్వం నియంత్రిస్తున్నదని తెలిపారు. అదానీ, అంబానీ లాంటి కొద్దిమంది కార్పొరేట్ల, అమెరికా లాంటి సామ్రాజ్యవాదుల బడా పెట్టుబడి, ఫైనాన్స్ క్యాపిటల్‌తో మోడీ, షాల పాలన దేశంలో ఫాసిజానికి బాటలు పరిచిందన్నారు. ఈ స్థితిలో ఫాసిస్టు వ్యతిరేక పోరాటం ప్రతీ ప్రజాస్వామికవాది, లౌకికవాది, కమ్యూనిస్టుల కర్తవ్యం కావాలన్నారు. దేశ భక్తియుత శక్తులతో, ప్రజాస్వామికవాదులతో ఫాసిస్టు వ్యతిరేక పోరాట కర్తవ్యాలను నిర్దేశించుకుని ఐక్య పోరాటాలు నిర్మిద్దామన్నారు. అదే కామ్రేడ్ రాయల సుభాష్ చంద్రబోస్‌కు నిజమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) రాష్ట్ర నాయకులు కే.యాదగిరి, డివిజన్ కార్యదర్శి ఎం.వెంకన్న, సహాయ కార్యదర్శి సీ.హెచ్ సాయగౌడ్, నగర కార్యదర్శి ఎం.సుధాకర్, జిల్లా నాయకులు రాజేశ్వర్, మోపాల్ మండల కార్యదర్శి డి.గంగమల్లు, పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షులు సాయిబాబా, ఐ.ఎఫ్.టి.యు జిల్లా నాయకులు లింగం, సాయిరెడ్డి, వివిధ ప్రజాసంఘాల నాయకులు భాస్కర స్వామి, లలిత, లింగం, గంగారాం, గంగాధర్, రాజు తదితరులు పాల్గొన్నారు.


నిజామాబాద్ సిటీ : కామ్రేడ్ రాయల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు


ఆర్మూర్‌లో..

బోధన్ : విప్లవ ప్రతిఘటన పోరాటయోధుడు కామ్రేడ్ రాయల సుభాష్ చంద్రబోస్ 8వ వర్ధంతిని శనివారం బోధన్ పట్టణంలోని తట్టికోటలో సీపీఐ(ఎంఎల్)ప్రజాపంథా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు రాయల సుభాష్ చంద్రబోస్ చేసిన ఉద్యమాలను, పోరాట ఫలితాలను కొనియాడారు. కార్యక్రమంలో బోధన్ డివిజన్ సహాయ కార్యదర్శి బి.మల్లేష్, బోధన్ మండల కార్యదర్శి పడాల శంకర్, ప్రగతిశీల మహిళా సంఘం పట్టణ కమిటీ అధ్యక్షురాలు బి.నాగమణి, ఏఐకేఎంఎస్ మండల కార్యదర్శి జి.సీతారాం, సి.హెచ్.గంగారాం, పి.పోశెట్టి, బి.శంకర్, రాజు, పి.శంకర్, సుశీల, అరుణ, ఎం.శంకర్, సలీం, మహేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ : గోదావరిలోయ ప్రతిఘటన యోధుడు కామ్రేడ్ రవన్న అని ఆయన ఆశయం అయిన జనతా ప్రజాతంత్ర విప్లవం సాధించిన రోజే కామ్రేడ్ రవన్నకు ఘనమైన నివాళి అర్పించిన వాళ్ళమవుతామని సిపిఐఎంఎల్ మాస్‌లైన్ (ప్రజాపంథా) డివిజన్ కార్యదర్శి బి.దేవారం పేర్కొన్నారు. శనివారం మాస్‌లైన్ కేంద్రకమిటీ సభ్యులు, రాష్ట్ర కార్యదర్శి రాయల సుభాష్ చంద్రబోస్ (రవి) 8వ వర్ధంతి సభను నిర్వహించారు. సభకు ముందు రాయల సుభాష్ చంద్రబోస్ (రవి) చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా డివిజన్ కార్యదర్శి డి.దేవారం కార్యకర్తలను ఉద్దేశించి ఆయన పాల్గొని మాట్లాడుతూ.. ఆదివాసుల విముక్తి కోసం ఆదివాసులకు భూమిపై హక్కు కల్పించడం కోసం 40 సంవత్సరాలు అజ్ఞాత జీవితంలో అనేక పోరాటాలు నిర్వహించిన గొప్ప విప్లవ యోధుడు కామ్రేడ్ రవన్న అని అన్నారు. అడవి ఉద్యమాన్ని మైదాన ప్రాంత ఉద్యమాన్ని సమన్వయం పరుస్తూ పేద ప్రజలు విముక్తి కోసం తమ రక్తాన్ని ధారబోసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. కార్మికవర్గ పోరాటాలు కూడా కార్మికుల శ్రమను ఏ విధంగా పెట్టుబడిదారులు దోచుకుంటున్నారో విషయాలను కూడా సంక్షిప్తంగా కార్యకర్తలకు చెప్పి వాళ్లను సైతం చైతన్యం పరిచిన గొప్ప వ్యక్తి కామ్రేడ్ రవన్న అని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీ జిల్లా నాయకులు ఎం.ముత్తెన్న, డివిజన్ నాయకులు ఆకుల గంగారాం, రాజన్న, ఠాకూర్, శేఖర్, నరేందర్, నజీర్, పిడిఎస్‌యు ఏరియా ప్రధాన కార్యదర్శి నిఖిల్, నాయకులు సిద్దు, బిరుగొండ శివ తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ : గోదావరిలోయ ప్రతిఘటన యోధుడు కామ్రేడ్ రవన్న అని, ఆయన ఆశయమైన జనతా ప్రజాతంత్ర విప్లవం సాధించిన రోజే కామ్రేడ్ రవన్నకు ఘనమైన నివాళి అర్పించిన వాళ్ళమవుతామని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ (ప్రజాపంథా) రాష్ట్ర నాయకులు పిట్ల రామకృష్ణ పేర్కొన్నారు. శనివారం సీపీఐఎంఎల్ మాస్ లైన్ కేంద్రకమిటీ సభ్యులు, రాష్ట్ర కార్యదర్శి రాయల సుభాష్ చంద్రబోస్ (రవి) 8వ వర్ధంతి సభను సిరికొండలోని పార్టీ కార్యాలయంలో మండల కమిటీ కార్యదర్శి ఆర్.రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. సభకు ముందు రాయల సుభాష్ చంద్రబోస్ (రవి) చిత్రపటానికి పూలమాలలు వేసి మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ ఆర్మూర్ డివిజన్ నాయకులు, జిల్లా అధ్యక్షులు అనీస్, దామోదర్, లింబాద్రి, సాయిరెడ్డి, మండల నాయకులు రమేష్, సర్పంచ్ సాయిలు, నరేష్, రాజ్‌కిషోర్, ఎస్‌కే బబ్లూ, రామన్న, నాగన్న, బాబురావు తదితరులు పాల్గొన్నారు.


బోధన్‌లో...

బీజేపీ తప్పుడు ఆరోపణలు మానుకోవాలి

నవతెలంగాణ-కోటగిరి

బీజేపీ తప్పుడు ఆరోపణలు మానుకోవాలని సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు అన్నారు. మండల కేంద్రంలో ఏఐటీయూసీ-సిపిఐ ఆధ్వర్యంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి వై.ఓమయ్య మాట్లాడుతూ.. నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న రెండవ ఏఎన్ఎంలు, ఇతర విభాగాలలో పనిచేస్తున్న ఉద్యోగులకు సంబంధించిన వేతనాలు ఇతర సౌకర్యాల కోసం కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాల్సిన బడ్జెట్ విడుదల చేయకపోవడం వల్ల, రాష్ట్ర ప్రభుత్వం మూడు నెలలుగా ఉద్యోగులకు చెల్లించాల్సిన వేతనాలను చెల్లించలేదని అన్నారు. వేతనాలతో పాటు పిఆర్సి బకాయిలు, రెండవ ఏఎన్ఎంలకు ఆరునెలలు, ఇతర ఉద్యోగులకు ఏడు నెలలకు సంబంధించిన బకాయి డబ్బులు రావలసి ఉన్న సందర్భంగా ఏఐటీయూసీ విజ్ఞప్తి మేరకు సిపిఐ పార్టీ శాసనసభ పక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఈ రాష్ట్రంలో ఉన్న 17వేల మంది ఏఎన్ఎం ఉద్యోగులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, గ్రామీణ ప్రాంతాల్లో నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజలకు ఎటువంటి అనారోగ్యాలు వచ్చిన, ప్రభుత్వం ఏ సర్వే కార్యక్రమాలు నిర్వహించిన వాటిని విజయవంతం చేస్తూ రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలకు మంచి పేరు తీసుకొస్తున్నటువంటి ఉద్యోగులకు రెగ్యులర్‌గా వేతనాలు చెల్లించాలని కేంద్ర ప్రభుత్వం నుంచి రావలసిన గ్రాంటును మాట్లాడితే తెప్పించుకోవాలని లేఖ రాస్తే, ఆ లేఖను తప్పుపట్టిన బిజెపి రాష్ట్ర కార్యదర్శి ప్రకాష్‌రెడ్డి ఎమ్మెల్యే పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైనది కాదన్నారు. బిజెపి నాయకత్వానికి ఉద్యోగుల పట్ల చిత్తశుద్ధి ఉంటే రాష్ట్రానికి రావలసిన గ్రాంట్‌ను తీసుకు వచ్చిన తర్వాత మాట్లాడాలని హితవు పలికారు. రాష్ట్రంలో కేంద్ర మంత్రి ఉన్న తెలంగాణ రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదన్నారు. తమ తప్పులను కప్పిపుచ్చుకోవడానికి ఎదుటి వారిపై నిందలు మానుకోవాలని లేదా బిజెపి రాష్ట్ర కార్యాలయం ముట్టడిస్తామని, నాయకులను గ్రామాల్లో తిరుగనివ్వమని హెచ్చరించారు. దేశం అభివృద్ధి చెందిందని ప్రగల్భాలు పలికే మోడీ నేషనల్ హెల్త్ మిషన్‌కు సంబంధించిన 40 శాతం నిధులను బిజెపి అధికారంలో ఉన్న ఐదు రాష్ట్రాలకు మాత్రమే మళ్ళించి ఇతర రాష్ట్రాలకు నయా పైసా కేటాయించకపోయినా బీజేపీ ఎంపీలు, మంత్రులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తూ. ప్రజా సమస్యలపై మాట్లాడుతున్న కమ్యూనిస్టు పార్టీ నాయకులను టార్గెట్ చేస్తే పుట్టగతులు ఉండవని పేర్కొన్నారు. ఇప్పటికైనా బిజెపి పాలకులు కమ్యూనిస్టులపై తప్పుడు ఆరోపణలు మానుకోవాలన్నారు.



మాట్లాడుతున్న వై.ఓమయ్య

హరీష్‌రావు వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరం

- పీఆర్టీయూ మండలాధ్యక్షులు సూదం వెంకటేష్

నవతెలంగాణ-పోతంగల్

రైతుబంధు డబ్బులు ఆపి ఏసీ రూముల్లో కూర్చునే ఉద్యోగులకు ప్రభుత్వం జీతాలు చెల్లించిందంటూ మాజీ మంత్రి హరీష్‌రావు గురువారం చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమని పీఆర్టీయూ మండలాధ్యక్షులు సూదం వెంకటేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికోసం నిరంతరం పాటు పడుతున్న ఉద్యోగులను ఇది అవమానించడమేనని ఆయన పేర్కొన్నారు. రైతుబంధుకు తాము వ్యతిరేకం కాదని, కానీ రైతులకు, ఉద్యోగుల జీతాలకు సంబంధం ఏంటని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందించటంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల పాత్ర కీలకమనీ, మొత్తం ఉద్యోగులలో మెజారిటీ ఉద్యోగులు, ఉపాధ్యాయులు క్షేత్ర స్థాయిలో, ఆఫీస్‌లలో, పాఠశాలల్లో కనీస వసతులు లేని పరిస్థితుల్లో పనిచేసే విషయాన్ని మాజీ మంత్రి గుర్తించాలని సూచించారు. గత ప్రభుత్వం జీతాలు ఆలస్యంగా చెల్లించటం మూలంగా బ్యాంక్ లోన్లు సమయానికి కట్టలేక ఫైన్ చెల్లించామని తెలిపారు.

ప్రతిభావంతులకు కరాటే బెల్టుల ప్రదానం



కరాటే బెల్టులతో విద్యార్థులు

నవతెలంగాణ-బోధన్

ఒకినోవా స్కూల్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో శనివారం సాలూర, బోధన్, బిలోలి మండలాలకు చెందిన కరాటే ప్రతిభావంతులకు వారి ప్రతిభను బట్టి బెల్టులను ప్రదానం చేశారు. మహారాష్ట్రలోని సన్ షైన్ ఇంటర్నేషనల్ పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్లు ఖయ్యూం, పల్లవి విద్యార్థులకు బెల్టులను ప్రదానం చేశారు. సాలూర మండలానికి చెందిన రుతిక, రుచిత, సాకేత్, భవ్యశ్రీ, జస్వంత్‌గౌడ్, శైలజకు ఎల్లో బెల్ట్, తేజస్విని, నితీన్‌కు ఆరెంజ్ బెల్ట్, బోధన్ పట్టణానికి చెందిన సుదీక్షకు గ్రీన్ బెల్ట్, శుభంకు బ్రౌన్‌బెల్ట్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సత్యనారాయణ, స్థానిక సర్పంచ్ సచిన్, స్థానిక పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సురేష్ షెట్కార్‌కు అభినందనలు వెల్లువ

నవతెలంగాణ-కోటగిరి

జహీరాబాద్ నియోజకవర్గ పార్లమెంట్ అభ్యర్థిగా మాజీ ఎంపీ సురేష్ షెట్కార్‌కు కాంగ్రెస్ అధిష్టానం టికెట్ కేటాయించడంతో ఆయనకు కాంగ్రెస్ నాయకులు అభినందనలు తెలిపారు. శనివారం కోటగిరి మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు షాహిద్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సురేష్ షెట్కార్‌కు ఎంపీ ఎన్నికల్లో పూర్తి సహకారం అందిస్తామని, అఖండ మెజార్టీతో అభ్యర్థి సురేష్ షెట్కార్ విజయం సాధిస్తారని పేర్కొన్నారు. గత అనుభవాలు, ప్రస్తుతం రేవంత్‌రెడ్డి అడుగుజాడల్లో, కాంగ్రెస్ పార్టీ రాహుల్‌గాంధీ నాయకత్వంలో ఆయన సునాయాసంగా ప్రత్యర్థులపై గెలుస్తారని ధీమావ్యక్తం చేశారు. గతంలో ఆయన చేసిన సేవలు మరువలేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు గంగాధర దేశాయ్, శివరాజ్ దేశాయ్, ఎంపీటీసీ జిల్లా డెలిగేట్ కొట్టం మనోహర్, నాయుడు వేణు, గ్రామ అధ్యక్షులు ఆయూబ్ తదితరులు పాల్గొన్నారు


మాట్లాడుతున్న నాయకులు

భగవద్గీత, హనుమాన్ చాలీసా పుస్తకాలు అందజేత

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కూనేపల్లి శివాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు భగవద్గీత, హనుమాన్ చాలీసా పుస్తకాలను ఉచితంగా అందజేశారు. మహాశివరాత్రి పండుగలు పురస్కరించుకొని ఆలయంలో శివుడుని దర్శించుకున్న భక్తులకు వాటిని ఉచితంగా అందజేసినట్టు వారు పేర్కొన్నారు. శనివారం ఉదయం చుట్టుపక్కల గ్రామాల నుంచి విచ్చేసి శివాలయంలో దర్శనం చేసుకున్న భక్తులకు ఉచిత పుస్తకాలతో పాటు, ఉపవాస దీక్షను విరమింపచేయడానికి అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు కరణ్‌రెడ్డి, దేవదాస్, (బుజ్జి సెట్) నరేందర్‌రెడ్డి, రామ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, పి.శ్రీనివాస్‌గౌడ్, దేవోళ్ళ వినోద్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.


పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

ఎస్ఐకి సన్మానం


ఎస్ఐని సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండలంలోని జువ్వాడి గ్రామ గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు యస్.ఐ ఆంజనేయులును శనివారం మర్యాదపూర్వకంగా కలసి శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సై ఆంజనేయులు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలందరూ కలిసిమెలిసి ఉండాలని ఎలాంటి గొడవలు పెట్టుకోవద్దని ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని చట్టాన్ని చేతిలోకి తీసుకోవద్దని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో విడిసి అధ్యక్షులు గుర్రం శ్యామ్, ఉపాధ్యక్షులు వడ్ల శ్రీనివాస్, బద్దం పెద్ద రాజీరెడ్డి, ప్రధాన కార్యదర్శి పల్లె కిషన్, సంయుక్త కార్యదర్శి చాకలి సాయిలు, క్యాషియర్ గొల్ల సాయిమల్లు, జాయింట్ చెక్ పవర్ పర్సన్ చిన్నోల్ల లస్మయ్య, సలహాదారులు మైముధ్ అలి, గొలుసు రమేష్ గ్రామస్తులు పాల్గొన్నారు పాల్గొన్నారు.

బీబీపాటిల్ గెలుపునకు పనిచేద్దాం


మాట్లాడుతున్న మండల ఇన్‌చార్జి

నవతెలంగాణ-మద్నూర్

ఎంపీగా బీబీపాటిల్ గెలుపునకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని బీజేపీ నాయకులు సూచించారు. మద్నూర్ మండల బిజెపి కార్యకర్తల సమావేశం శనివారం మండల కేంద్రంలోని మైథిలి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. సమావేశానికి మండల ఇన్చార్జ్ ఆకుల భారత్ హాజరు కాగా బిజెపి మండల అధ్యక్షులు తెప్ప వార్ తుకారాం అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో యువ నాయకులు అక్షయ్ పటేల్ , చాట్లవర్ హనుమాన్లు, బి హనుమానులు, కష్ణ పటేల్ , సంతోష్ తులావర్ , యాదవరావు , సంతోష్ పాటిల్ , హన్మండ్లు , అనిల్ ,వీరేశం , సుధాకర్ , తదితరులు ఉన్నారు.

దుమ్ములో ప్రయాణం ఇంకెన్నాళ్లు..?

- 8 నెలలైనా.. మూడు కిలోమీటర్ రోడ్డు పనులు పెండింగ్
- కంకర వేసి వదిలేయడంతో దుమ్ము దూళితో పాటు ప్రమాదాలు
- ఇటీవల రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి
- పత్తాలేని కాంట్రాక్టర్.. పట్టించుకోని అధికారులు, పాలకులు



నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండలంలోని పెద్దపూతంగల్ గ్రామ స్టేజి నుండి మేడిపల్లి వరకు మూడు కిలోమీటర్‌ల మేర రోడ్డు విస్తరణ పనులు 8 నెలల క్రితం గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. సుమారు 14 కోట్ల రూపాయలను మంజూరు చేసింది. మూడు కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం కోసం టెండర్లు నిర్వహించి కాంట్రాక్టర్లు పనులు అప్పగించింది. గత ఎనిమిది నెలలుగా మూడు కిలోమీటర్ల పనులు కొనసాగుతూనే ఉన్నాయి. గత సంవత్సరం జూన్‌లో ప్రారంభమైన పనులు ఈఏడు మార్చ్ నెల వచ్చినా ఇప్పటికీ పనులు పూర్తికాలేవు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యమా లేక అధికారుల నిర్లక్ష్యమా లేక ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యమో కానీ గత ఎనిమిది నెలలుగా ఈ రహదారి వెంట ప్రయాణించే ప్రయాణికులు దుమ్ము ధూళీతో నరకం అనుభవిస్తున్నారు.

కాంట్రాక్టర్ కంకర వేసి వదిలేశాడు. గత మూడు నెలలుగా ఎలాంటి పనులు కొనసాగడం లేదు. కంకర వేసి వదిలేయడంతో ఆ రహదారి వెంట ప్రయాణించే ప్రయాణికులు తరచూ ప్రమాదాల గురవుతున్నారు. ఈ మధ్యకాలంలో వాహనాలు అదుపుతప్పి ఇద్దరు మృతి చెందారు. అయినా కాంట్రాక్టర్ కానీ అధికారులు కానీ ప్రజా ప్రతినిధులు కానీ పట్టించుకోవడంలేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. కంకర వేసి వదిలేయడంతో ఆ మూడు కిలోమీటర్ల ప్రయాణంలో దుమ్ము లేవడంతో ప్రయాణం నరకంలా తయారైందని ద్విచక్ర వాహనంపై వెళ్లే వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్ద వాహనాలు వెళ్లడంతో వెనుక వెళ్లే వారికి దుమ్ముతో చాలా ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని దుమ్ము లేవడం వల్ల ముందట రహదారి కనిపించడం లేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్ కానీ అధికారులు కానీ స్పందించి కంకరపై కనీసం నీలైనా చెల్లించాలని పనులు త్వరగా పూర్తి చేయాలని వాహనదారులు మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మూడు కిలోమీటర్ల రోడ్డు పనులు ఇంకెన్నాళ్లు చేస్తారని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు

ఈ నెలాఖరు వరకు పూర్తి చేస్తాం

ఆర్అండ్‌బి ఏఈ శ్రీకాంత్

రోడ్డు పనులు పెండింగ్‌లో పడటం వాస్తవమే. వాహనదారుల ఇబ్బందులపై ఫిర్యాదులు వచ్చాయి. ఈ నెలాఖరులోగా పోతంగల్ స్టేజి నుంచి మేడిపల్లి వరకు గల మూడు కిలోమీటర్ల రోడ్డు పనులను పూర్తి చేస్తాం.

ఎమ్మెల్యేకు సన్మానం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని కౌలాస్ గ్రామంలోని మహంతేశ్వర మల్లికార్జున స్వామీ గురు మఠంలో మహశివరాత్రీ మహెూత్సోవాలలో బాగంగా శ్రీ బ్రమరాంబ సహిత మల్లికార్జున స్వామీ వారి కళ్యాణం శనివారం నిర్వహించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే లక్ష్మికాంత్‌రావ్ హాజరు కాగా.. నిర్వహకులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ సంధర్భంగా స్వాముల వారు మాట్లాడుతు ఈ నెల పదకొండవ తేదీన పాదయాత్ర సందర్భంగా ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రం అందించినట్టు తెలిపారు.

అనంతరం పార్టీ గ్రామ అధ్యక్షుడితో కలిసి గ్రామంలో ఇటీవల మరణించిన పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట పార్టీ మండల సీనియర్ నాయకులు అస్పత్ వార్ వినోద్, రమేష్ దేశాయి, కాలాస్ గ్రామ కాంగ్రేస్ పార్టీ అద్యక్షుడు గంగారెడ్డి , మిర్చిమోహన్, వెంకటేష్ కార్యకర్తలు , తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ నుంచి కాంగ్రెస్‌లో చేరికలు


ఎమ్మెల్యే సమక్షంలో పలువురు చేరిక

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని కేమ్రాజ్‌కల్లాలీ గ్రామానికి చెందిన పలువురు బీఎస్పీ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మికాంత్‌రావు సమక్షంలో క్యాంప్ కార్యలయంలో శనివారం వారు కండువా కప్పుకున్నట్టు మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రమేష్ రావు దేశాయి తెలిపారు. కేమ్రాజ్ కల్లాలి గ్రామం నుండి దేశాయ్ ఆధ్వర్యంలో బిఎస్పీ పార్టీ మండల అధ్యక్షులు డా. విల్లాస్, సొసైటీ మాజీ చైర్మన్ గుల్ల రాములు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, యువకులు కాంగ్రెస్‌లో చేరారు.

ఎమ్మెలే తోట లక్ష్మీకాంతారావ్ మాట్లాడుతు కాక్యకర్తలే తన ఉపిరి అని, కార్యకర్తల కృషి ఓటర్ల ఆశీర్వాదంతో ఎమ్మెల్యే అయ్యానని, వారిని ఎప్పుడూ విస్మరించనని, గుండెల్లో పెట్టుకొని చూసుకుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అస్పత్ వార్ వినోద్, మహమ్మదాబాద్ మాజీ సర్పంచ్ లక్షెట్టి సాయులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సురేశ్‌షెట్కార్ అభ్యర్థిత్వం పట్ల

కాంగ్రెస్ నాయకుల సంబరాలు


సంబురాలు చేసుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-పిట్లం

జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా సురేష్ షెట్కర్ పేరును జాతీయ కాంగ్రెస్ పార్టీ ప్రకటించడంతో మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం టపాసులు కాల్చి సంబరాలు నిర్వహించారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ లోకసభ ఎన్నికలకు గాను జాతీయ కాంగ్రెస్ పార్టీ 36 మందితో తొలి జాబితా ప్రకటించగా తెలంగాణకు చెందిన 4 ఎంపీ స్థానాల అభ్యర్థుల పేర్లు ఖరారు చేసిందని అందులో జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పేరు ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికలలో నారాయణఖేడ్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా సురేష్ షెట్కర్ పేరు ఖరారు అయినప్పటికీ చివరి క్షణములో ఆయన అనుమతితోనే సంజీవరెడ్డి కి పార్టీ టికెట్టు ఖరారు అయినట్లు పేర్కొన్నారు. ఇంతటి త్యాగాన్నీ గుర్తించిన జాతీయ కాంగ్రెస్ పార్టీ హై కమాండ్ లోకసభ టికెట్టు కట్టబెట్టినట్లు తెలిపారు. కాగా 2004లో అసెంబ్లీ , 2009 లో నిర్వహించిన పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గెలుపొంది , 2018 లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో ఓడిపోయనట్లు తెలిపారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగుతుండడంతో మారిన రాజకీయ సమీకరణాలతో జహీరాబాద్ పార్లమెంట్ స్థానమును కైవసం చేసుకుంటామని వారు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రామ్ రెడ్డి, జాంబిగే హన్మాండ్లు, మోహన్ రెడ్డి, కష్టారెడ్డి, బొడ్ల రాజు, ఎనుగండ్ల శ్రీనివాసరెడ్డి, చిప్ప శివ, డాకూరి వెంకట్ రెడ్డి, కుమ్మరి చిన్న రాములు, నజీర్ సెట్, హనుమ గంగారాం, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, శ్రేయోభిలాషులు, మైనారిటీ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయం చుట్టూ దుకాణ సముదాయాలు

- సందర్శకులకు ఇబ్బందులు


ఆలయం చుట్టూ దుకాణాలు వేలిసిన దృశ్యం

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండల కేంద్రంలోని పాత బస్టాండ్ సమీపంలో గల ఆంజనేయస్వామి ఆలయం చుట్టూ ఏర్పాటు చేసుకున్న వ్యాపార సముదాయాల పట్ల ఆలయానికి వచ్చిన సందర్శకులకు కూర్చోవటానికి ఇబ్బందులు కలుగుతున్నాయి. ఆలయం చుట్టూ ఏర్పాటు చేసే దుకాణాల పట్ల గ్రామపంచాయతీ అధికారులు పట్టించుకోవాలని కోరుతున్నారు. ఎటుపడితే అటు ఇష్టం వచ్చిన రీతిలో చిరు వ్యాపార దుకాణాలు ఏర్పాటు చేయడం పట్ల ఆలయం భక్తులకు ఇబ్బందికరంగా ఏర్పడుతుందని ఆలయం చుట్టూ శుభ్రత నెలకొల్పాలని భక్తులు గ్రామస్తులు కోరుతున్నారు.

ఆలయాల వద్ద అన్నదానం


ఆలయంలో అన్నదానం నిర్వహిస్తున్న భక్తులు

నవతెలంగాణ-మద్నూర్

మహాశివరాత్రి పురష్కరించుకొని శనివారం ఆలయాల వద్ద అన్నదానం కార్యక్రమం చేపట్టారు. మద్నూర్ మండల కేంద్రంలోని ప్రఖ్యాత గాంచిన సోమలింగాల శివాలయం వద్ద భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమానికి మహాశివరాత్రి ఏకాదశి ఉపవాస భక్తులు ప్రత్యేకంగా పాల్గొన్నారు. కాగా శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెల్లవారు జాము వరకు శివాలయాల వద్ద భజనలు, కీర్తనలు నిర్వహించారు.

మాజీ ఎమ్మెల్యేకు సన్మానం

మద్నూర్ గ్రామపంచాయతీ గ్రామ శివారు పరిధిలో గల సోమ లింగాల శివాలయాన్ని శనివారం నాడు జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హనుమంతు షిండే సందర్శించి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించారు మాజీ ఎమ్మెల్యే వెంటా గ్రామ మాజీ సర్పంచ్ బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

శివాలయల వద్ద అన్నదానం

సదాశివనగర్: మండలం లోని పలు గ్రామాల్లో మహా శివరాత్రి పండుగ పురస్కరించుకుని అన్నాదాన కార్యక్రమం శనివారం నిర్వహించారు. అడ్లూర్ ఎల్లారెడ్డి వీరభద్రస్వామి ఆలయం, సదాశివనగర్ లోని బీరప్ప ఆలయం వద్ద కుర్మ సంఘం అద్వర్యం లో పద్మాజివాడి గ్రామంలో ని శివాలయం వద్ద గ్రామ అబివృద్ధి కమిటి అద్వర్యం లో అన్న కార్యక్రమం నిర్వహించారు.


అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

రైతు బిడ్డకు పీహెచ్‌డీ పట్టా

- పలువురు హర్షం


పీహెచ్‌డీ పట్టా అందుకుంటున్న బాలరాజు

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రానికి చెందిన రాజారాం బాలరాజు రైతు కుటుంబానికి చెందిన రైతు బిడ్డకు శనివారం పీహెడీ పట్టా పొందినట్టు స్థానికులు తెలిపారు. లింగంపేట్ గ్రామ వ్యవసాయ కుటుంబానికి చెందిన జారాం బాలరాజు 2022లో రూరల్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌లో గాంధీ గ్రామ్ యూనివర్సిటీ నుండి పీహెచ్‌డీ పట్టా పొందారు. మార్చ్ 9న పిహెచ్‌డి పట్టాను అధికారికంగా ఎస్. సోమనాథ్, ఇస్రో చైర్మన్ చేతుల మీదుగా పొందారు. ఈ సంధ్బంగా ఆయన మాట్లాడుతూ సన్న కారు రైతు కుటుంబానికి చెందిన వాడినని, డిగ్రీ వరకు తల్లిదండ్రులలో పాటు వ్యవసాయ పనుల్లో చేదోడు వాదోడుగా ఉండే వాడినని, స్వయంగా చాలా దగ్గరి నుంచి గ్రామాల్లో ఉన్న పారిశుధ్యం, విద్య, వైద్యం, పంచాయతీల పాలన చూశానని, సదరు సమస్యలకు సంబందించిన సబ్జెక్ట్ అయిన రూరల్ డెవలప్మెంట్ లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదివి ఆ తర్వాత, రూరల్ ఎడ్యుకేషన్ లో పి హెచ్ డి చేయాలని ఆసక్తి ఏర్పడిందన్నారు. తన పి హెచ్ డి గురువు ప్రొఫెసర్ రాజా, తల్లిదండ్రులు లక్ష్మి బాలయ్య ల ఆశీర్వాదం, స్నేహితుల వెన్నుదన్ను కూడా తనని ప్రోత్సహించింది అని ఆయన అన్నారు.

లబ్దిదారులకు జీరో బిల్లు అందజేత

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండలంలోని పోచారం తండాలో శనివారం నాడు లబ్ధిదారులకు విద్యుత్ శాఖ అధికారులు జీరో బిల్లును అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు పడవాల్ బచ్చన్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామిలో భాగంగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి ఒక్క లబ్ధిదారులకు 200 యూనిట్ల విద్యుత్ ను ఉచిత హామిలో అమలు చేస్తున్న ఘనత ఆయనకే దక్కిందని కొనియాడారు. అంతే కాకుండా కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చిన వెంటనే తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు గెమ్ సింగ్,శ్రీకాంత్, నాయకులు పడవాల్ నారాయణ్,శంకర్, గోపిరావు,తదితరులు పాల్గొన్నారు.


జీరో బిల్లును అందజేస్తున్న విద్యుత్ శాఖాధికారులు

కాంగ్రెస్‌లో పలువురి చేరికలు


ఎమ్మెల్యే సమక్షంలో పలువురు చేరిక

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ మండలం మాటూరు మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి శనివారం రోజు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు కృష్ణారెడ్డి తెలిపారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ రావు ఎల్లారెడ్డి లో గల క్యాంప్ కార్యాలయంలో పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

జోరుగా

ఇసుక అక్రమ రవాణా

- కొమ్ముకాస్తున్న పోలీసులు..?
- కన్నెత్తి చూడని రెవెన్యూశాఖ అధికారులు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

పెద్దకొడప్ గల్ మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలకే కాకుండా సంగారెడ్డి జిల్లా తడ్కల మండలానికి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. బిచ్కుంద మండలంలోని హస్గుల్, పుల్కల్, తదితర మంజీర పరివాహ ప్రాంతాల నుండి అక్రమంగా ఇసుక రవాణా చేపడుతున్నారు. కానీ అటు వైపుగా రెవెన్యూ శాఖ గాని , పోలీసు అధికారులు దృష్టి సారించకపోవడంతో అక్రమాదారులు తమదైన శైలిలో అక్రమ దందాను కొనసాగిస్తున్నారు. దీనికి తోడు అధికారులకు ఆమ్యామ్యాలు అందుతుండడంతో వీరి వ్యాపారం మూడు టిప్పర్లు, ఆరు ట్రాక్టర్లుగా మారుతోంది. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుంది. కొంత కాలంగా ప్రభుత్వ అనుమతితో ఇసుక రవాణా జరిగినా ప్రస్తుతం అనుమతులు లేకుండానే అధికారులకు మాముళ్ల అందజేస్తూ తమ వ్యాపారాన్ని యథేచ్ఛగా కొనసాగిస్తున్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ తంతు అంతా అధికారులకు తెలిసే జరుగుతుందని అనుమానాలకు తావిస్తోంది. రాత్రి వేళల్లో ఇసుక రవాణా జరుగుతున్నప్పటికీ స్థానిక పోలీసులు ఇసుక ట్రాక్టర్లను ఆపి ప్రశ్నించి అడగ్గా ట్రాక్టర్ డ్రైవర్లు ఫోన్‌లో మాట్లాడివ్వడంతో పోలీసులు ఆ వాహనాలను వదిలిపెడుతున్నట్టు భోగట్ట. ఆ ఫోన్‌లలో మాట్లాడుతుంది ఎవరు..? ప్రజా ప్రతినిధుల లేక పోలీస్ అధికారుల అనేది తెలియాల్సి ఉంది. అక్రమాలను అరికట్టాల్సింది పోయి అక్రమ ఇసుక రవాణా చేస్తున్న దళారులకు కొమ్ము కాయడంతో దళారులు వచ్చిందే తడవుగా ట్రాక్టర్ ఇసుకను ఐదు నుంచి ఆరు వేలకు విక్రయిస్తున్నారు. అధికారుల చేతి వాటం వల్లే ఇదంతా జరుగుతుందని పలువురు జనాలు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులకు వారికి కావాల్సిన ముడుపులు చెల్లడంతో ఈ తంతు మధ్యాహ్నం సమయంలో కూడా యదేచ్ఛగా నడుస్తుందని పలువురు ఆరోపణలు వ్యక్తం చేస్తున్నారు. కానీ ఇసుక దళారులు మాత్రం రాత్రి పగలు అని తేడా లేకుండా ఇష్ట రాజ్యాంగ ఇసుక రవాణా చేపట్టడం శోచనీయం. మండల కేంద్రంలో ఉన్న పోలీస్ స్టేషన్ ముందు నుండే ఇసుక రవాణా జరుగుతున్నా స్థానిక పోలీసులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ ఆదాయాలకు గండి కొడుతూ ప్రభుత్వ అధికారులు జేబులు నింపుకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని లేకపోతే అధికారుల జేబులు నింపుకొని ప్రభుత్వ ఖజానాన్ని గండి కొట్టడంతో ప్రభుత్వానికి వచ్చే ఆదాయం శూన్యం అవుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అంతేకాకుండ జగన్నాథ్ పల్లి నుండి పోచారం వెళ్లే రోడ్డు మార్గంలో కూడా రాత్రి సమయంలో ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్టు సమాచారం. ఇకనైనా పోలీస్, రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.



నవతెలంగాణ
నిజామాబాద్
ఆదివారం మార్చి 10, 2024 www.navatelangana.com

మర్రిచెట్టు దేవస్థానాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే


దేవస్థానం వద్ద ఎమ్మెల్యే

నవతెలంగాణ-ముప్కాల్

ఆదిలాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా శనివారం ఉదయం ముప్కాల్ మర్రిచెట్టు దేవస్థానం 'శ్రీ శివలింగేశ్వర స్వామి' వారిని మార్గమధ్యంలో బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి దర్శించుకున్నారు. జిల్లా ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆయన వెంట కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు ముత్యాల సునీల్‌కుమార్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు గడుగు గంగాధర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముస్కు మోహన్‌రెడ్డి, గడ్డం ప్రతాప్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మగ్గిడి ముత్యంరెడ్డి, బద్దం సాగర్‌రెడ్డి, పోల ప్రవీణ్, ఆర్మూర్ ఏసీపీ బస్వారెడ్డి, రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్సై భాస్కరాచారి, ఆలయ కమిటీ, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులున్నారు.

ఆకట్టుకున్న కుస్తీ పోటీలు


తలపడుతున్న మల్లయోధులు

నవతెలంగాణ-బోధన్

సాలూర మండల కేంద్రంలో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం గ్రామస్తులు కుస్తీ పోటీలను నిర్వహించారు. ఈ కుస్తీ పోటీలకు సమీప గ్రామాల నుంచే కాకుండా మహారాష్ట్ర నుంచి మల్లయోధులు తరలివచ్చి కుస్తీ పోటీలలో తలపడ్డారు. అనంతరం కుస్తీ పోటీలో గెలుపొందిన విజేతలకు నిర్వాహకులు నగదు బహుమతి అందించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మెన్ జనార్ధన్, సోమేశ్వర మందిర్ చైర్మెన్ శంకర్ పటేల్, సురేష్, అల్లె రమేష్ గ్రామస్థులు పాల్గొన్నారు.

వినయ్‌రెడ్డిని పరామర్శించిన బోధన్ ఎమ్మెల్యే


వినయ్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ పొద్దుటూరి వినయ్ కుమార్‌రెడ్డిని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి శనివారం పరామర్శించారు. వినయ్‌కుమార్ నానమ్మ గంగవ్వ ఇటీవల మరణించడంతో పట్టణంలోని ఆయన నివాసంలో పరామర్శించారు. అంతకుముందు గంగవ్వ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఆయన వెంట రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, గడుగు గంగాధర్, నరాల రత్నాకర్, మాజీ నిజాంసాగర్ కెనాల్ చైర్మన్ మిర్ధపల్లి సాయిరెడ్డి, ఫతేపూర్ శ్రవణ్‌రెడ్డి, జీటీపీఎల్ ఎండి ప్రకాశ్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మున్నుభాయ్, కౌన్సిలర్లు అయ్యప్ప శ్రీనివాస్, ఖాందేశ్ శ్రీనివాస్, రవి గౌడ్, కాశీరాం, ఆకుల రాములు, ఫయాజ్, అథిక్, రహమాన్, పట్టణ మండల అధ్యక్షులు సాయి బాబాగౌడ్, చిన్నరెడ్డి, ఆలూర్ మండల అధ్యక్షులు ముక్కెర విజయ్, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు ఇస్సాపల్లి జీవన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన


సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న పలువురు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండలంలోని గుట్ట కింది తండాలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, లంబాడ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు లౌడ్య మహిపాల్, గౌరారం ఎంపీటీసీ మలావత్ జమున పరశురామ్, విడిసి చైర్మన్ ఫుల్‌సింగ్‌లతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 3 నెలల్లోనే నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి సహకారంతో రూ.2లక్షల నిధులను ఉపాధి హామీలో భాగంగా నిధులను మంజూరు చేశారని తెలిపారు. ఈ సందర్భంగా తండా ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే భూపతిరెడ్డికి ప్రత్యేక అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాజు, గంగారాం నాయక్, దారాసింగ్, జైందర్, కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కలిసి మెలిసి ఉండాలి

- పి.డి.ఎస్.యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్


విద్యార్థులతో మాట్లాడుతున్న పి.డి.ఎస్.యూ జిల్లా ప్రధాన కార్యదర్శి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

హాస్టల్ విద్యార్థులు జూనియర్, సీనియర్ అని తేడాలేకుండా కలిసి మెలిసి ఉండాలని పి.డి.ఎస్.యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ విద్యార్థులను కోరారు. బోధన్‌లో బీసీ హాస్టల్ ఘటన నేపథ్యంలో డిచ్‌పల్లి మండల కేంద్రంలోని హాస్టల్లో విద్యార్థులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వర్ మాట్లాడుతూ.. హాస్టల్ విద్యార్థులు గొడవలకు దూరంగా ఉంటూ చదువుకోవాలని, ఏదైనా సమస్యలుంటే సంబంధిత హాస్టల్ వార్డెన్‌కు చెప్పాలని అన్నారు. ఇంటర్ విద్యార్థులు పరీక్షల్లో రాణించాలని, కామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ టెస్ట్ సంబంధించిన మెటీరియల్‌ను పి.డి.ఎస్.యూ విద్యార్థి సంఘం తరపున పేద విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేస్తామని అన్నారు. కార్యక్రమంలో పి.డి.ఎస్.యూ నాయకులు రవీందర్, అక్షయ్, వరుణ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

సాటాపూర్ సంతలో బైక్ దొంగతనం

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని సాటాపూర్ సంతలో గుర్తు తెలియని వ్యక్తి (టీవీఎస్ ఎక్సెల్)ను దొంగిలించినట్లు బాధితుడు నాగారావ్ స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. నీలా గ్రామానికి చెందిన నాగారావు మార్కెట్లో తన బైక్‌ను లాక్ చేసి సరుకులు కొనుగోలు చేసుకొని బైక్ వద్దకు రాగా తన బైకును గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించుకుపోయారు. అలాగే బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల ప్రారంభోత్సవానికి రాగా, బీసీ సెల్ మండల అధ్యక్షులు గోసుల గంగాకిషన్ బైక్‌ను పాఠశాల ముందు లాక్ చేసి ఉన్నప్పటికీ దానిని గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. ఇటీవల బైకు దొంగతనాలు ఎక్కువగా జరుగుతుండడంతో ప్రజల్లో బయందోళన రేకెత్తిస్తున్నాయి. నీలా గ్రామంలో మరో బైకు దొంగతనానికి గురైనట్లు తెలిసింది. బైకు దొంగలపై ప్రత్యేక దష్టి సారించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సొంతింటి కల సాకారమయ్యేనా..?

- నియోజకవర్గానికి రూ.175 కోట్ల రూపాయల నిధుల కేటాయింపు..
- 11న సీఎం రేవంత్ రెడ్డి చేతులమీదుగా ప్రారంభం



నవతెలంగాణ-ముప్కాల్

రాష్ట్రంలో పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారి సొంతింటి కళను నెరవేర్చే ప్రయత్నంలో భాగంగా అధికార కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. ఈ క్రమంలో ఈ నెల 11వ తేదీన సోమవారం 'ఇందిరమ్మ ఇండ్ల' పథకానికి శ్రీకారం చుట్టనుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 11వ తేదీన సోమవారం రోజు ప్రారంభించనున్నారు. తొలి విడతలో భాగంగా ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఒక్కొక్క ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల చొప్పున ఆర్థిక సాయం చేయనుంది. ఈ లెక్కన రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గానికి రూ.175 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేయనున్నారు. జిల్లాలో 5 నియోజవర్గాలతో పాటు బాన్సువాడ నియోజకవర్గంలోని ఐదు మండలాలున్నాయి. ఈ లెక్కన ఒక్కో జిల్లాకు ఇందిరమ్మ ఇండ్ల బాటకై రూ.875 నుంచి రూ.955 కోట్ల రూపాయల నిధులను కేటాయించనుంది. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అంటే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల స్థలాల కోరకు వాటి నిర్మాణాలకు అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంలో ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణలతో కొత్త కాలనీలు వెలిశాయి. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం కోసం మొగ్గుచూపిన విషయం తెల్సిందే.

ఎంపిక విధానం ఇలా..?

గతంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణలకు, లబ్ధిదారులను ఎంపిక చేసే అధికారం ఎమ్మెల్యే అనుమతి ఉండేది. మరి ఈ సారి కాంగ్రెస్ ప్రభుత్వం ఎమ్మెల్యేలకు ఇస్తుందా లేక జిల్లా ఇంఛార్జి మంత్రికి అవకాశం ఇస్తారో వేచి చూడాలి. ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకి అవసరమైన మార్గదర్శకాలను జారీ చేస్తేనే లబ్ధిదారుల ఎంపిక ఎలా జరుగుతుందో, లబ్ధిదారుల అర్హతపై ఒక స్పష్టత రానుంది. అదేవిధంగా ఇండ్ల నిర్మాణం, ఇంటి రూపకల్పన (డిజైన్) కూడా ప్రభుత్వం నిర్దేశించనుంది. గృహలక్ష్మీ పథకాన్ని రద్దు చేస్తూ అధికార కాంగ్రెస్ పార్టీ ఇందిరమ్మ ఇండ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ఈ పథకానికి పునప్రారంభం చేయడం పట్ల నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

హామీలను అమలు చేస్తుంది



కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో ఇప్పటివరకు నాలుగు గ్యారెంటీలను ఆములు చేసిన ఘనత అధికార కాంగ్రెస్ పార్టీకే చెందుతుంది. మిగిలిన రెండు అతి త్వరలో ఆములుకు సిద్ధం కాబోతోంది కాంగ్రెస్ పార్టీ. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇండ్లు అంటూ రాష్ట్ర ప్రజలను మోసం చేసింది. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతోనే ఇచ్చిన గ్యారెంటీలను ఆములుపరుస్తూ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణలకు రూ.5లక్షల రూపాయలను ఇచ్చేలా ఈ పథకాన్ని సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించడం శుభపరిణామం.

- ముస్కు మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ముప్కాల్.

చేతివృత్తులకు చేయూత

- ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం
- ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, బ్యాంక్ అకౌంట్‌తో దరఖాస్తు చేసుకోవచ్చు



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

చేతివృత్తుల కులాలకు చేయూతనందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని ప్రవేశపెట్టింది. అయితే ప్రస్తుతం ప్రభుత్వం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తోంది. ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి ఆఖరుతేదీ అంటూ ప్రభుత్వం నిర్ణయించలేదు. కాగా ఇదివరకు రిజిస్ట్రేషన్ చేసుకున్న దరఖాస్తులను గ్రామస్థాయిలో అధికారులు పరిశీలిస్తున్నారు.

దరఖాస్తు ఇలా..

మైక్రో స్మాల్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ ద్వారా ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకంలో అర్హులైన వారందరూ దరఖాస్తు చేసుకోవచ్చు. మీ సేవతో పాటు ఇతర ఆన్‌లైన్ కేంద్రాల్లో ఎక్కడైనా ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే దరఖాస్తు చేసుకునే సమయంలో ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, బ్యాంకు ఖాతా ఉండాలి. దరఖాస్తుదారుడు సైతం తప్పకుండా ఉండాలి. దరఖాస్తులో భాగంగా దరఖాస్తు దారుడి వేలిముద్రలను తీసుకుంటారు. ఈ పథకంలో వడ్రంగి, పడవల తయారీ, కమ్మరి, స్వర్ణకారులు, కుమ్మరి, శిల్పకారులు, చర్మకారులు, చెప్పులు కుట్టేవారు, తాపి పని చేసేవారు, బుట్ట, చాప, చీపుర్లు వేసేవారు, బొమ్మల తయారీదారులు, సంప్రదాయాలు, క్షురకులు, బట్టలు ఉతికే వారు(రజకులు), బట్టలు కుట్టేవారు(దర్జీలు), మిషన్ మీద పనిచేసుకునేవారు, పూల వ్యాపారం చేసేవారు అర్హులు. ఇలా వృత్తి వ్యాపారం చేసుకునే వారికి పీఎం విశ్వకర్మ పథకం ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి అర్హులను గుర్తించి 15 రోజుల వరకు ట్రైనింగ్ (శిక్షణ) ఇస్తారు. శిక్షణ సమయంలో రోజుకు రూ.500 చొప్పున డబ్బులు చెల్లిస్తారు. శిక్షణ తరగతుల అనంతరం ఐడికార్డ్, సర్టిఫికెట్ అందజేస్తారు. తరువాత వ్యాపార అభివృద్ధి కొరకు మొదటి విడతగా రూ.లక్ష రుణాన్ని అందిస్తారు. దానిని 18 నెలలో తిరిగి చెల్లించినవారికి రెండో విడతగా రూ.రెండు లక్షల రుణాన్ని అందజేస్తారు. దానిని 30 నెలల్లో తిరిగి చెల్లించాలి. అయితే రుణం పొందిన లబ్దిదారులు లోన్ చెల్లించే సమయంలో ఐదు శాతం వడ్డీ ద్వారా చెల్లించవలసి ఉంటుంది.

టీడీపీ క్రమశిక్షణ గలది

- జాతీయ ప్రధాన కార్యదర్శి బక్కిని నర్సింలు


మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణ గల పార్టీ అని జాతీయ ప్రధాన కార్యదర్శి బక్కిని నర్సింలు అన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం సమావేశాన్ని పార్లమెంట్ అధ్యక్షులు దేగాం యదాగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర మాజీ అధ్యక్షులు, పొలిట్ బ్యూరో సభ్యులు, జాతీయ ప్రధాన కార్యదర్శి బక్కిని నర్సింలు హాజరై మాట్లాడారు. నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్‌లో గల నవనాథ సిద్ధుల గుట్ట సందర్శించి, దాని విశిష్టత గురించి గొప్పగా చెప్పుకొచ్చారు. తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణ గల పార్టీ అని, పార్టీ కార్యకర్తలు అందరూ సమన్వయంగా ఉండాలని అన్నారు. తెలుగు ప్రజలకు నిజమైన స్వాతంత్రం కేవలం తెలుగుదేశం పార్టీ వల్లనే కలిగిందని అన్నారు. ప్రజా క్షేత్రంలో ఉండే ప్రతిపక్ష పార్టీలను గౌరవిస్తూ అధికార పార్టీ, వాటిపై దృష్టి పెట్టి ప్రజల సమస్యలు ఎల్లప్పుడూ తెలుసుకుంటూ ఉండాలని సూచించారు. పార్టీ సంస్థ గత నిర్మాణం కొరకు గ్రామస్థాయి నుండి పటిష్టం చేయాలని అన్నారు. పార్టీ కార్యాలయం కొరకు ఇచ్చిన స్థలం గురించి, అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి ఉన్న సమస్యలను త్వరలో విముక్తి కలిగిస్తానని భరోసానిచ్చారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకు పనిచేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో అతిథి తుమ్మల ప్రసాద్, అర్బన్ ఇంచార్జ్ వినోద్ కుమార్, పార్లమెంట్ కమిటీ నాయకులు రెంజర్ల సురేష్, హనుమంతరావు, జ్యోతి నారాయణ, సోమ్ నారాయణరెడ్డి, బాల్కొండ నియోజకవర్గం ఇంచార్జ్ గోపిడి రాజన్న, అనుబంధ సంఘం అధ్యక్షులు దంతాల ఆనంద్, శ్రీనివాస్ బాబు, బొబ్బ నరసింహరావు, జనార్ధన్‌చారి, విఠల్, అర్బన్ సీనియర్ నాయకులు అంబిక సత్యనారాయణ, కోయేది నర్సింలు, కల్లెడ గంగాధర్, శంకర్ ముదిరాజ్, లవంగ రాజు, మల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీ గోవర్ధన్‌గౌడ్, శాదుల్లా, విష్ణు, లక్ష్మి యాదవ్, రాజేశ్వర్, ఫిరోజ్, నాగేశ్వర్‌రావు, శేఖర్, పెద్ద గంగారం, చందు తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలోయ ప్రతిఘటన యోధుడు కామ్రేడ్ రవన్న

- జనతా ప్రజాతంత్ర విప్లవ సాధనే కామ్రేడ్ రవన్నకు ఘననివాళి
- సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) జిల్లా నాయకులు సారా సురేష్


నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

గోదావరిలోయ ప్రతిఘటన యోధుడు కామ్రేడ్ రవన్న అని, ఆయన ఆశయమైన జనతా ప్రజాతంత్ర విప్లవం సాధించిన రోజే కామ్రేడ్ రవన్నకు ఘనమైన నివాళి అర్పించినట్లు అవుతుందని సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) జిల్లా నాయకులు సారా సురేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ కేంద్ర కమిటీ సభ్యులు, రాష్ట్ర కార్యదర్శి రాయల సుభాష్ చంద్రబోస్ (రవి) 8వ వర్ధంతి సభను మండల కమిటీ కార్యదర్శి అశోక్ అధ్యక్షతన నిర్వహించారు. సభ ప్రారంభానికి ముందు రాయల సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి రెండు నిముషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి సారా సురేష్ మాట్లాడుతూ.. ఆదివాసుల విముక్తి కోసం, ఆదివాసులకు భూమిపై హక్కు కల్పించడం కోసం 40 సంవత్సరాలు అజ్ఞాత జీవితంలో అనేక పోరాటాలు నిర్వహించిన గొప్ప విప్లవ యోధుడు కామ్రేడ్ రవన్న అన్నారు. అడవి ఉద్యమాన్ని, మైదాన ప్రాంత ఉద్యమాన్ని సమన్వయం పరుస్తూ పేద ప్రజలు విముక్తి కోసం తమ రక్తాన్ని ధారబో సినటువంటి గొప్ప వ్యక్తి అని కొనియాడారు. కార్మికవర్గ పోరాటాలు కూడా కార్మికుల శ్రమను ఏ విధంగా పెట్టుబడిదారులు దోచుకుంటున్నారో సంక్షిప్తంగా కార్యకర్తలకు చెప్పి వాళ్లను కూడా చైతన్యం పరిచిన గొప్ప వ్యక్తి కామ్రేడ్ రవన్న అని పేర్కొన్నారు. ఆయన ఆశయాలు ముందుకు తీసుకెళ్లాలంటే సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజా ఉద్యమాల ద్వారానే, కార్మికవర్గ పోరాటాల ద్వారానే ఈ వ్యవస్థ మార్పు చెందుతుందన్నారు. అదే భావనలో కూడా సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీ పనిచేస్తున్నదని, కామ్రేడ్ రవన్న లక్ష్యాలు ఆశయాలు నేరవేరాలంటే ప్రతి కార్యకర్త ప్రజా సమస్యలపై నిరంతరం పని చేయాలని కోరారు. కార్మికవర్గం, సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ కార్యకర్తలు కూడా నిత్యం ప్రజల్లో ఉండి ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించి, రవన్న ఆశయాలను ముందుకు తీసుకెళ్లిన నాడే అయనకు నిజమైన నివాళి అర్పించినట్లు అన్నారు. కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఆర్మూర్ డివిజన్ నాయకులు రాజేశ్వర్, కిషన్, సత్యనారా యణగౌడ్, సత్తెక్క, బాలన్న, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకంపై అవగాహన



ప్లాస్టిక్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని దుర్గానగర్ తండా గ్రామ పంచాయతీ పరిధిలో దాస్‌నగర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ శీతాకాల శిబిరంలో భాగంగా ఐదవ రోజు గ్రామంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మైక్రో బయాలజీ లెక్చరర్ టీ వాసవీలత ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నివారణ అనే అంశంపై ప్రజలకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మైక్రో ప్లాస్టిక్ వల్ల మానవజాతి మనగడకు ముప్పువాటిల్లుతుందని అన్నారు. భూమిపైన, నీటిలో ఉండే జీవరాసులు ఆ ప్లాస్టిక్‌ను తినడం వల్ల మానవులపై కలిగే దుష్ప్రభావాలను గ్రామస్తులకు తెలియజేశారు. మైక్రో ప్లాస్టిక్ వల్ల మానవులకు క్యాన్సర్ మొదలైన రోగాల బారిన పడే అవకాశాలున్నాయని అన్నారు. ఇందులో భాగంగా గ్రామంలోని గుడి, వాటర్ ట్యాంక్ పరిసరాలను పరిశుభ్రపరిచారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం.సరిత, డి.సుమలత, శ్వేత, విద్యార్థులు పాల్గొన్నారు.

మోదుగ.. ఆకర్షణ



నవతెలంగాణ-కోటగిరి

మండలంలో ప్రతి గ్రామంలో రహదారుల పక్కన మోదుగ చెట్లు ఏపుగా పెరిగి ఆకర్షిస్తున్నాయి. మోదుగ చెట్ల పూలు శివునికి ఎంతో ఇష్టం. రెండ్రోజులుగా జరిగిన శివరాత్రి వేడుకల్లో సైతం భక్తులు శివుడికి ఈ పూలను సమర్పించిన విషయం తెలిసిందే. ప్రకృతిని ప్రేమిస్తే ప్రకృతే మనకు అనంతంగా ఇస్తుందని అనడంలో ఎలాంటి సందేహం లేదు. మోదుగ చెట్టు ఆకులు.. భోజనం చేసే విస్తారాకులుగా, పూలు ఆయుర్వేదంగా ఉపయోగపడతాయని పూర్వీకులు చెబుతున్నారు. ఎండాకాలంలో చెట్లు ఆకురాలి, మోదుగ పూలు ఆకర్షణీయంగా ఉంటాయని, వీటిని అగ్గిపూలు అని కూడా అంటారని చెబుతున్నారు. ఈ పూలను వివిధ రకాల మందులలో ఉపయోగిస్తారని అంటున్నారు.

అలాగే హెూలీ పండుగకు ఈ పూలను ఉడకబెట్టి రంగుగా తయారు చేసి వాడతారు. మనిషి ఆయుష్షు పెంచడానికి, చర్మవ్యాధుల నివారణకు, అజీర్ణ రోగాలకు ఆయుర్వేదంలో మోదుగ పూలకు విశేషమైన ప్రాచుర్యం ఉందని అంటున్నారు. అయితే ఈ మోదుగ పూల చెట్లు కోటగిరి మండలంలోని పలు రహదారులకు ఇరువైపులా ఉండటం వల్ల ప్రయాణికులను ఆకర్షిస్తున్నాయి.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
ఆదివారం | మార్చి 10, 2024 | www.navatelangana.com

ఘనంగా రథోత్సవం

నవతెలంగాణ-బోధన్

మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం బోధన్ ఏకచక్రేశ్వర శివాలయంలో ఆలయ కమిటీ నిర్వాహకులు ఘనంగా రథోత్సవం నిర్వహించారు. కార్యక్రమం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో రెండు రోజులుగా జాతర నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ తూము పద్మ, ఏసీపీ శ్రీనివాస్‌రావు, ఆలయ కమిటీ చైర్మెన్ హనుమంత్‌రావు, పట్టణ ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.



పూజ చేస్తున్న పలువురు

హాస్టల్‌లో ఇద్దరు విద్యార్థుల మధ్య ఘర్షణ

నవతెలంగాణ-ఆర్మూర్

ఆలూర్ మండల కేంద్రంలోని ఇద్దరు విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరికి చెయ్యి విరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రంలోని మైనారిటీ గురుకుల పాఠశాలలో సాలూర మండల కేంద్రానికి చెందిన ఓ విద్యార్థి ఎనిమిదవ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం రాత్రి హాస్టల్ భవనంపై మరో విద్యార్థితో జరిగిన ఘర్షణలో చేతికి తీవ్ర గాయమై విరిగినట్టు తండ్రి లాలయ్య శనివారం తెలిపారు. ఈ విషయమై పాఠశాల వార్డెన్‌ను అడగగా సీసీ ఫుటేజ్ పరిశీలన ఆధారంగా ఆ విద్యార్థికి టీసీ ఇచ్చి పంపిస్తామని చెప్పినట్టు తెలిపారు. ఇద్దరు విద్యార్థుల మధ్య ఘర్షణలో మరొక విద్యార్థి సైతం ఇద్దరినీ ఆపినట్టు తెలిపారు.



నిజామాబాద్ సిటీ: అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న భక్తులు



మాక్లూర్: ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే



కమ్మర్‌పల్లిలో...

ఆలయాల వద్ద అన్నదానం

- **ప్రత్యేక పూజలు**

నవతెలంగాణ-విలేకరుల బృందం

మహాశివరాత్రిని పురస్కరించుకుని శనివారం శివాలయాలతో పాటు వివిధ ఆలయాల వద్ద మహా అన్నదానం చేపట్టారు. శుక్రవారం శివరాత్రి పండుగ నేపథ్యంలో భక్తులు ఉపవాస దీక్షలు చేపట్టగా.. శనివారం ఆలయాల వద్ద ఉపవాస దీక్షలను విడిచారు.

నిజామాబాద్ సిటీ : మహాశివరాత్రి పండగ పర్వదినం సందర్భంగా ప్రధాన ఆలయాల వద్ద ప్రజలు పెద్దసంఖ్యలో అన్నదానంలో పాల్గొన్నారు. నగరంలోని కంఠేశ్వర్‌లోని నీలకంఠేశ్వర ఆలయం, హైమదీ బజార్‌లోని శంభుని ఆలయం, నిఖిల్ సాయి వద్ద అమరేశ్వరుని ఆలయం, వినాయక్‌నగర్‌లోని అమరలింగేశ్వరుని ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమంలో జిల్లా ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

మాక్లూర్ : మండల కేంద్రంలోని బ్రహ్మంగారి ఆలయం వద్ద శివరాత్రి సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని గ్రామ కమిటీ అధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఉపవాస దీక్షను ఇక్కడే వదిలారు. రెండు రోజుల జాతరను నిర్వహించారు. మధ్యాహ్నం సమయంలో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి బ్రహ్మంగారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయనను గ్రామ కమిటీ అధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. నిజాంసాగర్ కెనాల్ చివరి ఆయకట్టు అయిన 72వ తూము వరకు కెనాల్ నీరు రాకపోవడంతో పంటలు ఎండుతున్నాయని రైతులు ఆయన దష్టికి తీసుకువెళ్లారు. అధికారులతో మాట్లాడుతానని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు అమ్రాద్ నరేందర్, ఎంపిటిసి వెంకటేశ్వర్ రావు, మాజీ సర్పంచ్ అశోక్ కుమార్, రాజేందర్, మాజీ సింగిల్ విండో చైర్మన్ రమణ రావు, గ్రామస్థులు, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి : మండలంలోని ఉప్లూర్, నాగాపూర్, అమీర్‌నగర్, హసాకొత్తూర్, కమ్మర్‌పల్లి గ్రామాల్లోని శివాలయాల్లో శనివారం అన్నదానం కార్యక్రమాలను నిర్వహించారు. ఆయా గ్రామాల్లో స్థానిక గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మహాశివరాత్రి ఉపవాసాల విరమణ కోసం అన్న వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఉపవాస దీక్షలు చేపట్టిన భక్తులు ఉదయం ఆలయాల్లో దర్శనం చేసుకొని అన్న సత్రంలో భోజనం చేయడం ద్వారా ఉపవాస దీక్షలు విరమించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నదాన సత్రంలో భోజనాలు చేశారు. మండల కేంద్రంలోని కాశీర్ హనుమాన్ ఆలయం వద్ద నిర్వహించిన అన్న వితరణ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జాతికి భూవనేశ్వర్, విఠల్ గౌడ్, క్యాతం సంపత్, గౌతమ్, దుర్గయ్య, భూమేష్, నూనె రవీందర్, సామ కిషన్, సుంకెట్ రవి, క్యాతం కృష్ణ, యువజన సంఘాల సభ్యులు, ఆయా గ్రామాల్లో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

భీంగల్ : శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని భీంగల్ పట్టణ కేంద్రంలోని నందీశ్వర ఆలయం వద్ద సర్వసమాజ్ కుప్కల్ రోడ్డులో గల శివాలయం వద్ద, ఎర్రోడుగల్లి మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో అన్నదాన సత్రాలను నిర్వహించారు. శివరాత్రి పండగ పూట ఉపవాసాలు ఉండే భక్తుల సౌకర్యార్థం అన్నదాన సత్రాలను ఏర్పాటు చేశారు. నందీశ్వర ఆలయం వద్ద ఉదయం 7గంటల నుంచి ప్రారంభించారు. ఈ అన్నదానానికి భీంగల్ పట్టణవాసులతోపాటు చుట్టుపక్క గ్రామాల ప్రజలు కూడా హాజరయ్యారు.



ఎడపల్లి: ఆలయంలో అన్నదానం చేస్తున్న భక్తులు

డిచ్‌పల్లి : శివరాత్రి సందర్భంగా ఆయా గ్రామాలలో శనివారం ఘనంగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఉమ్మడి మండల ప్రజలు అన్నదానంలో పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఉమామహేశ్వర ఆలయంలో ఎమ్మెల్యే పూజలు..

నందిపేట్ : ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి ఉమ్మెడ గోదావరి నది తీరాన గల ఉమామహేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాశివరాత్రి పర్వదినం ముగించుకొని స్థానిక ఆలయ సభ్యులు సాదర స్వాగతం పలికారు. ఆలయ విశిష్టత, ప్రాముఖ్యత గురించి ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు వివరించారు. ఆలయ సభ్యులు ఐక్యతతో ఆలయం మరింత ప్రాచుర్యం పొందాలని ఎమ్మెల్యే అన్నారు. మొదటిసారి వచ్చిన తనకు ఆలయ పరిసరాలు ఆకట్టుకున్నాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు భుతం సాయిరెడ్డి, ఉమ్మెడ మాజీ ఉప సర్పంచ్ డొంకేశ్వర్ సాయిరెడ్డి, రవీందర్, ముత్యం తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి : మండల కేంద్రంలోని వీరభద్ర గుడి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎడపల్లి స్థానిక నాయకుడు బొబ్బిలి శ్రీనివాస్ భక్తుల సౌకర్యం మేరకు అన్నీ వసతులు కల్పించారు. అలాగే మండల పరిషత్ కార్యాలయం నిర్వహించిన ఉచిత అన్నదాన కార్యక్రమానికి అన్యోన్య స్పందన లభించింది. అలాగే మండల పరిధిలోగల శ్రీ మహారాజ్ బాబా ఆశ్రయం శివాలయంలో న్యానంది రాజకుమార్, మల్లెపూలు శ్రీనివాస్, బొబ్బిలి శ్రీనివాస్‌లతోపాటు గ్రామ పెద్దల సమక్షంలో జాతర ఉత్సవాలను, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎడపల్లిలో గల శివుని గుడి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బీసీ కులగణనకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

- **నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి**



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

బీసీ కులగణనకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. మండలంలోని పడకల్ గ్రామంలో శనివారం మహాశివరాత్రి సందర్భంగా శ్రీరామ ఆలయం, శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆరు పథకాలను అమలుపరుస్తుందని చెప్పారు. రైతులకు గిట్టుబాటు ధర అందేలా ప్రభుత్వం సహకరిస్తుందని తెలిపారు. గ్రామ ప్రజలందరికీ మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మునిపల్లి సాయిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు చిన్నారెడ్డి, యూత్ మండలాధ్యక్షుడు సొప్పరి వినోద్, శేఖర్‌గౌడ్, పార్టీ కార్యకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ రిజర్వాయర్‌లో మతి చెందిన యువకుల అంత్యక్రియల్లో..

ఎస్సారెస్పీ రిజర్వాయర్‌లో నీటమునిగి మతి చెందిన యువకుల అంత్యక్రియల్లో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పాల్గొన్నారు. మండలంలోని గనియా తండాకు చెందిన ముగ్గురు యువకులు మృతిచెందడంతో శనివారం మధ్యాహ్నం యువకుల మతదేహాలు గ్రామానికి చేరుకున్నాయి. ఒకే తండాకు చెందిన ముగ్గురు యువకులు మృతిచెందడంతో తండాలో విషాద చాయలు అలుముకున్నాయి. యువకుల అంత్యక్రియలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పాల్గొన్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చి సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు తదితరులున్నారు.

సొంతగూటికి వలస బండి

- **చెరుకు క్రషింగ్ ముగియడంతో వెనుదిరిగిన కార్మికులు**
- **నాలుగు నెలలుగా చెరుకు కోత, తరలింపుతో ఉపాధి**



వెనుదిరిగిన వలస బండ్లు

నవతెలంగాణ-గాంధారి

నాలుగు నెలల పాటు ఉపాధి పొందిన వలస కార్మికులు.. పని పూర్తవ్వడంతో సొంత గూటికి తిరుగుప్రయాణమైయ్యారు. తమ ఎడ్లబండ్లతో గ్రామాలకు తరలివెళ్లారు. కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డిలో శివారులో గల గాయత్రి షుగర్ ఫ్యాక్టరీలో చెరుకు నరకడంతో పాటు ఎడ్లబండ్లపై చెరుకును ఫ్యాక్టరీకి తరలించడంతో పాటు దూర ప్రాంతాల్లో ఉన్న చెరుకును నరికి లారీల్లో నింపడం కోసం ఒప్పందం చేసుకొని వలస కూలీలు వస్తుంటారు. ఇంటిల్లిపాది వచ్చి.. రైతుల పంట పొలాల్లో చెరుకు నరికి ఫ్యాక్టరీ తరలించి జీవనోపాది పొందిన వలస కార్మికులు తిరిగి తమ సొంత గ్రామాలకు పయణమైయ్యారు.

గాంధారి మండల కేంద్రం గుండా శనివారం పొద్దుపొద్దున్న రోడ్డు పక్కన బండ్లను ఆపుకొని విశ్రాంతి తీసుకుంటూ కనిపించగా వారిని నవతెలంగాణ పలకరించింది. వారిది నారాయణఖేడ్ ప్రాంతమని.. సుమారు 500 జోడీలు అనగా 500 ఎడ్ల బండ్లను తీసుకొని ఉపాధి నిమిత్తం నవంబర్ నెలలో ఇక్కడికి వచ్చినట్టు తెలిపారు. స్థానికంగా అంతగా ఉపాధి అవకాశాలు లేకపోవడంతో వలస రావాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తంచేశారు. పనిలేక పొట్ట కూటి కోసం ఇక్కడ రావాల్సి వస్తుందని వేల సంఖ్యలో కుటుంబాలు వలసగా వస్తున్నామని తెలిపారు.

తాము తిరుగు ప్రయాణం చేసి వెళ్లేంత వరకు పల్లెల్లో వృద్ధులు, చిన్నారులు మినహా మా గ్రామంలో ఎవరూ ఉండరని అన్నారు. తమ ప్రాంతంలో ఉపాధి అవకాశాలు లేకపోవడం వర్షాభావ పరిస్థితులు వెంటాడుతుండటంతో ఉపాధి దొరకడం లేదని అన్నారు. తెలంగాణ వస్తే రాష్ట్రంలోనే వెనుకబడిన ప్రాంతమైన నారాయణఖేడ్ అభివృద్ధి చెందుతుందని నాయకులు గొప్పలు చెప్పారు. కానీ నాయకులు కనీసం ఉపాధి కూడా చూపడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు

- **ఎక్సైజ్ సిఐ వేణుమాధవ్**

నవతెలంగాణ-భీంగల్

భీంగల్ ఎక్సైజ్ పరిధిలోని సిరికొండ, ధర్పల్లి, ఇందల్వాయి, భీంగల్ మండలాలలో గంజాయి నాటుసారా నిర్మూలనకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ వేణుమాధవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గంజాయిని అరికట్టేందుకు ఎక్సైజ్ సిబ్బంది ఆధ్వర్యంలో ప్రతిరోజు రోడ్ వాచ్ నిర్వహిస్తూ నిఘాను పటిష్టం చేశామని పేర్కొన్నారు. ఇందుకోసం టోల్ ఫ్రీ కూడా ఏర్పాటు చేశామని, కనుక గంజాయిపై ఎలాంటి సమాచారమున్నా 8712658976 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని, సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని ఆయన తెలిపారు.

ప్రతి మహిళా సమసమాజ స్థాపనకు కృషి చేయాలి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

ప్రతి మహిళ సమాజ స్థాపనకు కృషి చేయాలని నేషనల్ జనరల్ సెక్రెటరీ మామిడాల మనోహర్, సౌత్ ఇండియా చైర్మన్ డాక్టర్ హనుమ గౌడ్ అన్నారు. సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జాతీయ చైర్మన్ డాక్టర్ కొప్పుల విజయ్ కుమార్ ఆదేశాల మేరకు నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఎస్.జె.డబ్ల్యు.హెచ్.ఆర్.సి. నిజామాబాద్ జిల్లా ప్రెసిడెంట్ ఎం.దత్తాద్రిగౌడ్, చైర్మెన్ డా.బి.సుధాకర్, అబ్జర్వేషన్ కమిటీ చైర్మెన్ బాజిరెడ్డి ప్రశాంత్, సిబ్బంది అందరూ కలిసి అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నేషనల్ జనరల్ సెక్రటరీ మామిడాల మనోహర్, సౌత్ ఇండియా చైర్మన్ డా.జి.హన్మగౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో విజయాలు సాధిస్తున్నారని పేర్కొన్నారు. మహిళలకు ఓర్పు, సహనం, నిబద్ధత, నిజాయితీ ఉన్నప్పుడు వారి కుటుంబాలు, సమాజం కూడా చాలా అందంగా ఉంటుందని తెలిపారు. ప్రస్తుత సమాజంలో కొంతమంది చట్టాలను అనుకూలంగా మార్చుకొని భర్తలపైన తప్పుడు కేసులు పెట్టి మానసిక వేదనకు గురి చేస్తున్నట్టు ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి ఘటనలు జరగకుండా కుటుంబాలను రోడ్లపైకి లాగకుండా ప్రతి మహిళ ఉన్నంతంగా సమ సమాజ స్థాపనకు కృషి చేయాలని, బిడ్డల భవిష్యత్తు, కుటుంబం బాధ్యత, సమాజంలో విలువలు కాపాడుకుంటూ అన్నీ రంగాల్లో ముందుకు వెళుతున్న ఆదర్శ మహిళా మూర్తులకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని వారు పేర్కొన్నారు. అనంతరం మహిమ ఫౌండేషన్ చైర్మెన్ మాలతి, మహిళా ఎస్సై రాజశ్రీ, రిటైర్డ్ టీచర్ ప్రేమలత, సోషల్ వర్కర్ ఏకే.లత, ప్రముఖ వైద్యులు భూలక్ష్మి, న్యాయవాది అంజలి, నాగనాథ్ లాంటి ఆదర్శ మహిళలను సత్కరించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ ఫర్ కౌన్సిల్ ప్రతినిధులు మాలెపు నారాయణ, చింతల పురుషోత్తం దాస్, గంగసారం చంద్రకాంత్‌రెడ్డి, ఏనుగు మహేందర్‌రెడ్డి, తోట సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయసేవ సంస్థ సేవలు చిరస్మరణీయం

- **హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సామ్ కోషి, జస్టిస్ శ్రీసుధ, జస్టిస్ తుకరాంజీ**
- **జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీతకు ప్రశంస పత్రం అందజేత**

నవతెలంగాణ-కంఠేశ్వర్

న్యాయసేవ సంస్థ సేవలు చిరస్మరణీయమని, నిజామాబాద్ జిల్లా న్యాయసేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న న్యాయవిజ్ఞాన సదస్సులు, సామాజిక చైతన్య కార్యక్రమాలకు చేయూతను అందిస్తామని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ కార్యనిర్వాహక చైర్మన్ జస్టిస్ సామ్‌కోషి, హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ శ్రీసుధ, జస్టిస్ తుకారాంజీ తెలిపారు. హైదరాబాద్‌లోని జస్టిస్ సామ్ కోషి నివాసంలో సహచర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ శ్రీసుధ, జస్టిస్ తుకారాంజీలతో కలిసి నిజామాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవ అధికార సంస్థ చైర్‌పర్సన్ సునీత కుంచాలకు ప్రశంసపత్రం అందజేశారు. బాలికల, మహిళల ఆత్మరక్షణలో భాగంగా తైక్వాండోతో పాటు, ఇతర ఆత్మరక్షణ పద్ధతులను సామాజిక స్ఫూర్తిగల వ్యక్తులు, వర్గాలతో కలిసి నేర్పించడం చిరస్మరణీయంగా నిలిచి ఉంటాయని అన్నారు. నిజామాబాద్‌లో మార్చి 3న 11 వేల మంది బాలికలు, మహిళలతో తైక్వాండో లాంటి ప్రదర్శనను ప్రదర్శించి ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో చోటు సంపాదించుకోవడం న్యాయసేవ సంస్థ చరిత్రలోనే ప్రముఖఘట్టంగా మిగిలిపోతుందని పేర్కొన్నారు. న్యాయసేవల ప్రాధికార చట్టం న్యాయమూర్తులను న్యాయార్థుల సేవలకై వారి దరికి దగ్గర చేస్తున్నదని వారు తెలిపారు. నిజామాబాద్ జిల్లా న్యాయసేవ అధికార సంస్థ ఆదర్శవంతమైన, ప్రగతిశీలక, స్ఫూర్తిదాయక కార్యక్రమాలకు వెన్నుదన్నుగా నిలుస్తామని వారు తెలిపారు.

ప్రశంసపత్రం అందజేసిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర న్యాయసేవ అధికార సంస్థ సభ్య కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, సంస్థ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి, సూపరింటెండెంట్ పురుషోత్తం గౌడ్, సంస్థ సిబ్బంది సుమలత, భరత్, లక్ష్మణ్, నాగేందర్ పాల్గొన్నారు.



జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీతకు ప్రశంస పత్రం అందజేత

కష్టపడ్డవారికి గుర్తింపు

- **ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు**
- **పలు మండలాలకు కాంగ్రెస్ అధ్యక్షుల ఎన్నిక**

నవతెలంగాణ-విలేకరులబృందం

కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డ కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు వెల్లడించారు. నియోజకవర్గంలోని పలు మండలాలకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎల్లారెడ్డిలోని క్యాంప్ కార్యాలయంలో ఈ సందర్భంగా వారికి నియామకపత్రాలు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో క్రియాశీల పాత్ర పోషిస్తూ కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఇటు కార్యకర్తలకు మరోవైపు పార్టీని నడిపించడంలో ప్రధాన పాత్ర తమదైన శైలిలో పోషించి ముందుకు సాగిన వారిని గుర్తించి పదవులు అప్పగిస్తున్నట్టు తెలిపారు. మండల అధ్యక్షులను ఈ సందర్భంగా ఎమ్మెల్యే సన్మానించి అభినందించారు.

లింగంపేట్ : మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షునిగా బుర్ర నారా గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాంగ్రెస్ పార్టీలో చురుకైన పాత్ర వహిస్తూ తమదైన శైలిలో గ్రామ గ్రామాన పార్టీని బలోపేతం చేసినట్టు నాయకులు తెలిపారు. అదే విధంగా లింగంపేట్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షునిగా లింగంపేట్ గ్రామానికి చెందిన సుప్పాల రాజును నియమించారు. అనంతరం ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు నూతనంగా ఎన్నికైన మండల కాంగ్రెస్ అధ్యక్షులు యూత్ అధ్యక్షులకు కార్యకర్తల సమక్షంలో శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపీపీ ఆసియా మోహిద్, ఎల్లమయ్య, దురిశెట్టి అశోక్, ప్రసాద్ గౌడ్, పతియోద్దీన్, కౌడ రవి, మాజీ సర్పంచులు పద్మ నాగరాజు రైనీ అశోక్, సంద బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

ఎల్లారెడ్డి మండలం అన్నసాగర్ ఎంపీటీసీ గురుప్రతాప్ శనివారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చుతుందన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కష్టపడి పని చేయాలని ఆయన సూచించారు.



లింగంపేట్: పార్టీ మండల అధ్యక్షునికి సన్మానం

నాగిరెడ్డిపేట్ మండల అధ్యక్షులుగా శ్రీధర్ గౌడ్

నాగిరెడ్డిపేట్ : కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా శ్రీధర్ గౌడ్‌ను నియమించినట్లు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం తెలిపారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే ఎన్నికల సమయంలో ధర్మారెడ్డి గ్రామ సర్పంచ్ గా ఉన్న శ్రీధర్ గౌడ్ ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు గెలుపునకు తన వంతు కృషి చేశారు. అదే విధంగా యూత్ అధ్యక్షుడిగా శ్రీరామ్ గౌడ్ నియమించినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

సదాశివనగర్ మండల అధ్యక్షుడుగా సంగారెడ్డి

సదాశివనగర్ : కాంగ్రెస్ పార్టీ సదాశివనగర్ మండల అధ్యక్షుడిగా జూకంటి సంగారెడ్డి, యుత్ మండల అధ్యక్షుడిగా అన్వేష్ గౌడ్ నియామకం అయ్యారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు నియామక పత్రాలను అందజేసి సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ.. తమపై నమ్మకం ఉంచి మండల అధ్యక్షులుగా ఎన్నుకున్నందుకు ఎమ్మెల్యే మదన్ మోహన్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్ఎస్ నుంచి పలువురు కాంగ్రెస్‌లో చేరిక

రైతుబంధు మండల మాజీ అధ్యక్షుడు భూంరెడ్డి, మాజీ ఎఎంసి డైరెక్టర్ సాదిక్ అలీ బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు కాంగ్రెస్ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఇప్పటికే సదాశివనగర్ మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నేతలు పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరగా.. తాజాగా వీరి చేరికతో బీఆర్ఎస్ ఖాళీ అవుతుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి,జిల్లా కాంగ్రెస్ సేవాదల్ అధ్యక్షుడు లింగాగౌడ్,మండల పార్టీ అధ్యక్షుడు సంగారెడ్డి, నియోజకవర్గ యుత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంపత్ గౌడ్, మాజీ ఉప సర్పంచ్ లక్ష్మీపతి, యుత్ మండల నాయకులు అన్వేష్ గౌడ్, సంతోష్ రెడ్డి, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.